ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
10-07-2024
బుధవారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 316 | పేజీలు : 8 | వెల : 4
జయభేరి



## తెలంగాణ కొత్త
# డీజీపీగా జితేందర్


### ప్రస్తుత డీజీపీ రవిగుప్తా హోంశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శిగా బదిలీ

**సీనియర్ ఐపీఎస్ అధికారి, హోం శాఖ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ జితేందర్ తెలంగాణ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా నియమితులయ్యారు. ఆయనకు డీజీపీ (హెచ్‌ఓపీఎఫ్) పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుత డీజీపీ రవి గుప్తా హోంశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నూతనంగా నియమితులైన డీజీపీ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో సమావేశమై బాధ్యతలు స్వీకరించారు.**

పంజాబ్‌లోని జలంధర్‌లో రైతు కుటుంబంలో జన్మించిన జితేందర్ 1992 బ్యాచ్ IPS అధికారి. పాకిస్థాన్‌కు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఫిరోజ్‌పూర్ లో వ్యవసాయ కుటుంబంలో జన్మించారు. ఢిల్లీకి వెళ్లి జేఎన్‌యూ నుంచి పట్టభద్రులయ్యారు. తొలుత బెల్లంపల్లి ఏఎస్పీగా పనిచేసిన నిర్మల్‌లో ఎస్పీగా విధులు నిర్వహించారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లోని మహబూబ్ నగర్, గుంటూరు జిల్లాల ఎస్పీగా పనిచేశారు. డీఐజీగా పదోన్నతి పొంది విశాఖపట్నం రేంజ్‌లో బాధ్యతలు నిర్వర్తించిన ఆయన తెలంగాణ ఉద్యమ సమయంలో వరంగల్ రేంజ్ డీఐజీగా కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ సీఐడీ, విచారణ కమిషన్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేసిన తర్వాత హైదరాబాద్ కమిషనరేట్‌లో ట్రాఫిక్ అదనపు కమిషనర్‌గా నియమితులయ్యారు. ఆ తర్వాత తెలంగాణ లా అండ్ ఆర్డర్ డిపార్ట్‌మెంట్ అడిషనల్ డీజీపీగా, జైళ్ల శాఖ డీజీగా పనిచేశారు. ప్రస్తుతం హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీగా ఉన్న ఆయన 2025 సెప్టెంబర్‌లో పదవీ విరమణ చేయనున్నారు. అదనపు డీజీపీగా తెలంగాణ రాష్ట్ర పోలీసు అకాడమీ డైరెక్టర్‌గా విశిష్ట సేవకు రాష్ట్రపతి అవార్డును అందుకున్నారు.

## ఏపీ ముఖచిత్రాన్నే మార్చే
# ప్రాజెక్టుకు సర్వం సిద్ధం

**ఏపీ ముఖచిత్రాన్నే మార్చే ప్రాజెక్టుకు సర్వం సిద్ధం ఏపీ ముఖచిత్రాన్నే మార్చే ప్రాజెక్టు అది. కేంద్రం ఎప్పుడో అనుమతినిచ్చిన ఈ ప్రాజెక్టుకు ఇప్పుడు నిధుల కేటాయింపులు జరగనున్నాయి. భూసేకరణతో సహా మొత్తం ఖర్చును భరించటానికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏమిటా ప్రాజెక్ట్? దానితో ఏపీ ముఖ చిత్రం ఎలా మారుతుంది?**



2 లో

**జయభేరి, విజయవాడ :**

కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు అనటానికి ఎన్నో ఉదంతాలున్నాయి. తాజాగా ఏపీ రాజకీయ ముఖ చిత్రాన్నే తీసుకుంటే.. ఉమ్మడి ఏపీ రెండు తెలుగు రాష్ట్రాలుగా విడిపోయిన సందర్భంలో విభజిత రాష్ట్రానికి తొలిసారి ముఖ్య మంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ఉన్నారు. స్వయంగా విజనరీ అయిన చంద్రబాబు ఏపీని కొత్తగా డిజైన్ చేయటానికి ఎన్నో ప్రణాళికలు రచించారు. రాష్ట్రం విడిపోయాక ఆర్థికంగా వెనుకబడిన ఏపీని గాడిన పెట్టటానికి చంద్రబాబు తనదైన శైలిలో ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. అందులో అత్యంత ప్రతిష్ఠాత్మకమైనది అమరావతి చుట్టూ అవుటర్ రింగ్ రోడ్డు నిర్మాణం. కేంద్రం నుంచి ఈ ప్రాజెక్టుకు అనుమతులు సాధించి పనులు మొదలు పెట్టాలనుకునేలోగా రాష్ట్రంలో అధికారం చేతులు మారింది. వైసీపీ పాలనలో



2 లో

# ధర్మాన్ని కాపాడే సత్తా ప్రజలకు మాత్రమే ఉంది





## అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న
# కార్పోరేటర్ భర్త

- బోడుప్పల్ అనఘాపురి కాలనీలో జోరుగా అక్రమ నిర్మాణాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు

**జయభేరి, మేడిపల్లి, జులై 10:**

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి నాలుగవ డివిజన్ అనఘాపురి కాలనీ, ఎన్ఐఎన్ కాలనీలలో, జోరుగా అక్రమ నిర్మాణాలు సాగుతున్నాయి. ఈ డివిజన్లో ఏ గల్లిలో చూసిన అక్రమ నిర్మాణమే దాదాపు ఈ నాలుగవ డివిజన్లోనే పదుల సంఖ్యలో అక్రమ నిర్మాణాలు ఉన్నాయి. కొన్ని నూతన అక్రమ నిర్మాణాలు అయితే మరికొన్ని పాత ఇల్లు మీదనే రెండంతస్తులు మూడు అంతస్తులు అక్రమంగా నిర్మాణాలు. ఈ అక్రమ నిర్మాణాల వెనుక కార్పొరేటర్ భర్త హస్తం ఉందని పలువురు గుసగుసలాడుతున్నారు. ఈ నాలుగవ డివిజన్లో కొంతమేరకు వక్ఫ్బోర్డు భూములు ఉన్నాయి. ఈ వర్క్ బోర్డ్ లో ఉన్నటువంటి ప్లాట్లకు ఇలాంటి అనుమతులు లేకుండా ఏకంగా రెండు అంతస్తులు మూడు అంతస్తుల అక్రమ నిర్మాణాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ వర్క్ బోర్డులో ఉన్నటువంటి ప్లాట్లకు అనుమతి రాదు కనుక ఇదే అదునుగా చూసుకొని కార్పోరేటర్ భర్త తో సహా మున్సిపల్ అధికారులు కూడా భారీగానే దండుకుంటున్నారనే సమాచారం. మున్సిపల్ ఆదాయానికి సహకరించాల్సిన అధికారులు సైతం భారీగానే ముడుపులు తీసుకుంటూ చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ ఇలాంటి అనుమతి లేని అక్రమ నిర్మాణాల మీద చర్యలు తీసుకొవాలని, అలాగే ముడుపులు తీసుకున్న అధికారులను విధుల నుండి బహిష్కరించాలని కోరుతున్న అక్కడి ప్రజలు.





## డబుల్ ధమాకా
# డబ్బుల స్కీం..

- ఆశ చూపి రూ. 40 కోట్లతో జనానికి కుచ్చుటోపీ..!

**జయభేరి, నల్లగొండ :**

అమాయక జనాలే ఆ కేటుగాళ్లకు టార్గెట్. వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని పెట్టిన పెట్టుబడి కంటే రెట్టింపు ఇస్తామని అత్యాశ కల్పించారు. స్టాక్ మార్కెట్లో పెట్టుబడులు పెడితే లాభాలు ఎక్కువగా వస్తాయని నమ్మించారు. దీంతో పెట్టుబడులు పెట్టండి.. భారీగా ఆదాయం పొందండి అంటూ కేటుగాళ్లు విసిరిన వలలో వందల మంది చిక్కుకున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా కోట్లాది రూపాయలను కుచ్చుటోపి పెట్టారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో ఘరానా మోసగాడు డబుల్ ధమాకా డబ్బుల స్కీంతో ఏకంగా రూ 40 కోట్లు కొల్లగొట్టాడు. చింతపల్లి మండలం మాల్ (గోడుకొండ్ల )వద్ద మదిని సంజయ్ రెడ్డి కుమారుడు మనీష్ రెడ్డి నాలుగేళ్ల క్రితం మనీ ఎంటర్‌ప్రైజెస్ స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ట్రేడర్స్ పేరుతో ఆఫీస్ తెరిచాడు. వంద పెట్టుబడితో రూ. 2వందలు, వెయ్యి పెడితే రూ. 2 వేలు, పదివేలు పెడితే ఇరవై వేల రూపాయలు, రూ. లక్షతో రెండు లక్షల రూపాయలు అంటూ డబుల్ ధమాకా ఆశ చూపించాడు.

...మిగతాది 2 లో

# కింగ్ పిన్.. కుట్రదారు అతడే..!



- ఢిల్లీ లిక్కర్ పాలసీ స్కామ్ ఈడీ చార్జ్‌షీట్‌లో సంచలనాలు..

**జయభేరి, ఢిల్లీ:**

ఢిల్లీ లిక్కర్ పాలసీలో కుంభకోణం జరిగినట్లు ఆరోపణలపై రూస్ అవెన్యూ కోర్టులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తోపాటు ఆయన ఆమ్ ఆద్మీ పార్టీని కూడా ఈడీ చార్జ్ షీట్‌లో నిందితులుగా చేసింది. ఈ కుంభకోణంలో అరవింద్ కేజ్రీవాల్‌ను కింగ్‌పిన్‌గా, కుట్రదారుడిగా ఈడీ అభివర్ణించింది. ఇదొక్కటే కాదు, గోవా ఎన్నికల్లో లంచం సొమ్మును వినియోగించినట్లు తమకు తెలిసిందని ఈడీ పేర్కొంది. అరవింద్ కేజ్రీవాల్, నిందితుడు వినోద్ చౌహాన్ మధ్య వాట్సాప్ చాటింగ్ వివరాలను చార్జ్ షీట్‌లో చేర్చారు ఈడీ అధికారులు. గోవా ఎన్నికల కోసం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత పీఏ వినోద్ ద్వారా ఆమ్ ఆద్మీ పార్టీకి రూ.25.5 కోట్లు పంపినట్లు ఆరోపణలు వచ్చాయి. అరవింద్ కేజ్రీవాల్‌తో వినోద్ చౌహాన్‌కు సత్సంబంధాలు ఉన్నాయని చాట్‌లో తేలిందని ఈడీ పేర్కొంది. మంగళవారం, కోర్టు ఈడీ ఛార్జ్ షీట్‌ను పరిగణనలోకి తీసుకుంది. జూలై 12న కోర్టు ముందు హాజరు కావాలని కేజ్రీవాల్‌కు సమన్లు పంపింది. మద్యం పాలసీ కేసులో మనీలాండరింగ్‌పై దర్యాప్తు చేస్తున్న ఈడీ మార్చి

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## ఏపీ ముఖచిత్రాన్నే మార్చే ప్రాజెక్టుకు సర్వం సిద్ధం

అమరావతి అంశమే మూలన పెట్టారు. దీంతో అనివార్యంగా ఓఆర్ఆర్ ప్రాజెక్టు మసకబారింది.

**మోదీ ప్రభుత్వానికి బాబు సహకారం ఎంతో కీలకం**

అనూహ్యంగా 2024 ఎన్నికల్లో మరోసారి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తిరుగులేని మెజార్టీతో ఏర్పాటయ్యింది. దీనికితోడు కేంద్రంలో మోదీ ప్రభుత్వానికి చంద్రబాబు సహకారం ఎంతో కీలకంగా మారింది. ఇంకేముంది అధికారంలోకి వచ్చీ రావటంతోనే సీఎం చంద్రబాబు అమరావతికి ఆక్సిజన్ అందించారు. రాజధాని పునర్నిర్మాణ దిశగా చకచకా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో పాటు మూలన పడిన ఓఆర్ఆర్ ప్రాజెక్టును కూడా పట్టాలెక్కించే పని పెట్టుకున్నారు. బాబు కోరిందే తక్షణం కేంద్రం కూడా ఓఆర్ఆర్ ప్రాజెక్ట్‌కు నిధులివ్వటానికి ముందుకొచ్చింది.

**ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.25వేల కోట్లు**

అమరావతి చుట్టూ కృష్ణా, గుంటూరు జిల్లాల గుండా నిర్మించే 189కి.మీటర్ల అవుటర్ రింగ్ రోడ్ ఎక్స్‌ప్రెస్‌వేను కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. ముఖ్యమైన మౌలిక సదుపాయాల అభివృద్ధి సిద్ధమైంది., మొత్తం ప్రాజెక్టు అంచనా వ్యయం 25వేల కోట్లుగా లెక్కగట్టారు. భూసేకరణతో సహా మొత్తం ఖర్చును కేంద్రప్రభుత్వమే భరిస్తుందని రాజమండ్రి ఎంపీ, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి ట్వీట్ ద్వారా వెల్లడించారు. ఈ మేరకు బడ్జెట్ లో నిధుల కేటాయింపు చేయనున్నారు. దీంతో ఓఆర్ఆర్‌కు మహర్దశ వచ్చినట్టేనని ఏపీ ప్రజలు మరీ ముఖ్యంగా ఓఆర్ఆర్ పరిసర గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. స్పాట్ .. బైట్స్

**ఏపీ ఆర్థిక స్థితిని గడ్కరీకి తెలిపిన బాబు**

ఈ ఏడాది బడ్జెట్‌లోనే 5వేల నుంచి 10 వేల కోట్ల నిధులు కేటాయించే అవకాశాలున్నాయని తెలుస్తున్నది. ప్రస్తుతం ఏపీలో ఉన్న ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా భూసేకరణ ఖర్చు కూడా కేంద్రమే భరించాలని సీఎం చంద్రబాబు కేంద్ర మంత్రి గడ్కరీని కోరారు. చంద్రబాబు ప్రతిపాదనపై కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించటం విశేషం. 2018లో ఈ ప్రాజెక్టును మొదటిసారి ప్రతిపాదించినప్పుడు అంచనా వ్యయం 17వేల కోట్లు. ఐదేళ్లుగా దీన్ని నిర్లక్ష్యం చేయటం వల్ల ఇప్పుడు అంచనా వ్యయం పెరిగి అది కాస్త 25వేల కోట్లకు చేరుకున్నది. అంటే జగన్ ప్రభుత్వ వైఖరి వల్ల 8వేల కోట్లు భారం అదనంగా పడింది.

**6 లేన్ల యాక్సెస్ కంట్రోల్‌తో ఎక్స్‌ప్రెస్ వే**

చంద్రబాబు ప్రభుత్వం రూపొందించిన ప్లాన్ ప్రకారం ఓఆర్ఆర్ మొత్తం 189 కిలోమీటర్లు. తూర్పు భాగంలో 78 కిలోమీర్లు కాగా.. పశ్చిమంలో 111 కిలోమీటర్లు. మొత్తం 3 దశల్లో 11 ప్యాకేజీలుగా ఓఆర్ఆర్ నిర్మాణం పూర్తి చేయాలని ప్రతిపాదించారు. 6 లేన్ల యాక్సెస్ కంట్రోల్‌తో ఎక్స్‌ప్రెస్ వేగా దీన్ని అభివృద్ధి చేయనున్నారు. ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో ఓఆర్ఆర్ విస్తరించనున్నది. 22 మండలాల పరిధిలోని 87 గ్రామాల మీదుగా ఓఆర్ఆర్ నిర్మితమవుతుంది. ఇందులో మొత్తం 9 ఇంటర్‌ఛేంజ్‌లుంటాయి. కొండ ప్రాంతాల్లో మూడు టన్నెల్స్ నిర్మిస్తారు. వీటితో పాటు 14 ఓవర్ బ్రిడ్జీలు కూడా నిర్మిస్తారు. ఇక 78 అండర్‌పాస్‌లు కూడా నిర్మాణమవుతాయి. స్పాట్:

**అమరావతి చుట్టూ ఉన్న పట్టణాలు కలిసి మెగా సిటీ**

ఓఆర్ఆర్ పూర్తయితే అటు ఏపీతోపాటు ఇటు అమరావతి అభివృద్ధి పరుగులు పెడుతుంది. ఏపీ ప్రభుత్వం పైసా ఖర్చు పెట్టకుండా పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే నిర్మాణ వ్యయం భరిస్తున్నది. దీని వల్ల రాష్ట్ర అభివృద్ధితోపాటు తమ కలల రాజధాని అమరావతితో పలు నగరాలకు దూరం తగ్గి, కనెక్టివిటీ బాగా పెరుగుతుంది. ఇది అంతిమంగా ఆర్థిక వృద్ధిని నమోదు చేస్తుంది. ఓఆర్ఆర్‌తో లోపలి భూములే కాక ఓఆర్ఆర్ బయట ఉన్న భూములకు మంచి డిమాండ్ వస్తుంది. ఈ ప్రాంత భూములు బంగారం అవుతాయి. ఎన్నో ఆర్థిక కార్యకలాపాలకు ఈ ప్రాంతం కేంద్రంగా మారిపోతుంది. ఓఆర్ఆర్ బయట కొన్ని కిలోమీటర్ల వరకు దీని ప్రభావం ఉండబోతున్నది. అమరావతి పక్కనే ఉన్న విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి వంటి పట్టణాలు కలిసిపోయి ఓ మహానగరంగా మారిపోయే అవకాశమున్నది.

చాలా నగరాల్లో ఓఆర్ఆర్‌లు చూస్తుంటాం.. వీటిని ప్రధానంగా ఆయా నగరాల్లో జనాభా పెరగటం వల్ల భరించలేని స్థాయికి చేరుకున్న ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు నిర్మించారు. దీంతో పాటు కొత్త ప్రాంతాలకు కూడా అభివృద్ధిని విస్తరించేందుకు ఔటర్ రింగ్ రోడ్లు ఉపయోగపడ్డాయి. అయితే అమరావతి చుట్టూ నిర్మించే ఓఆర్ఆర్ వీటికి భిన్నంగా రూపొందుతున్నది. అమరావతి చుట్టూ ఉన్న ప్రాంతాలను ఓ ప్రణాళిక ప్రకారం డెవలప్ చేయాలన్న లక్ష్యంతో రాజధానికి లింక్ గా ఉండేలా ఓఆర్ఆర్‌ను నిర్మించనున్నారు.

**రెండువైపులా 150 మీటర్ల సర్వీస్ రోడ్లు**

ఉమ్మడి కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాల గుండా సీఆర్‌డీఏ పరిధిలో 189 కిలోమీటర్ల పొడవున అవుటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తున్నారు. రెండు వైపులా 150 మీటర్ల వెడల్పుతో సర్వీసు రోడ్లు, ఆరు వరుసల యాక్సెస్ కంట్రోల్ ఎక్స్‌ప్రెస్‌వేని నిర్మిస్తారు. ఈ ప్రాజెక్టుకు 3వేల 404 హెక్టార్ల భూమి సేకరించాలి. దీనికి 4వేల 198 కోట్ల ఖర్చు అవుతుందని 2018లో అంచనా వేశారు. ఐదేళ్లు గడిచిపోవడంతో భూసేకరణ వ్యయం భారీగా పెరిగే అవకాశమున్నది. ఈ ప్రాజెక్టుకు అప్పట్లోనే చంద్రబాబు ప్రభుత్వం అవుటర్ రింగ్ రోడ్ ఫర్ న్యూ క్యాపిటల్ సిటీ అని పేరు పెట్టింది.

**కృష్ణానదిపై రెండు ఐకానిక్ బ్రిడ్‌జ్‌లు**

కృష్ణా, గుంటూరు జిల్లాల మీదుగా వెళ్లే నేషనల్ హైవేస్, స్టేట్ హైవేస్ తో పాటు జిల్లా ప్రధాన రహదారులను 13 చోట్ల ఓఆర్ఆర్ క్రాస్ చేస్తుంది. ఓఆర్ఆర్‌లో భాగంగా కృష్ణా నదిపై రెండు ఐకానిక్ బ్రిడ్జిలను నిర్మిస్తారు. అమరావతి ఆలయానికి సమీపంలో ఒక బ్రిడ్జి, తొట్లవల్లూరు దగ్గర మరో బ్రిడ్జిని నిర్మిస్తారు. ఇవే గాకుండా ఓఆర్ఆర్ రూట్‌లో 12 మెయిన్ బ్రిడ్జీలు, 51 స్మాల్ బ్రిడ్జిలు నిర్మిస్తారు. ఓఆర్ఆర్ లోపం మొత్తం 40 మండలాలున్నాయి.

ప్రస్తుతం అమరావతికి వెళ్లాలంటే విజయవాడ, గుంటూరు, తాడేపల్లి, మంగళగిరి మీదుగా వెళ్లాల్సిందే. ఈ మార్గాల్లో నిత్యం విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. పైగా చుట్టూ తిరిగి వెళ్లాలి. అదే ఓఆర్ఆర్ పూర్తయితే ఏపీలోని పలు ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి రోడ్డు మార్గంలో నేరుగా అమరావతిని చేరుకోవచ్చు. అమరావతికి ప్రతిపాదనలో ఉన్న మచిలీపట్నం, నిజాంపట్నం పోర్టులు చెరోవైపు ఉన్నాయి. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ వంటి తీర ప్రాంతం లేని రాష్ట్రాలకు ఈ రెండు పోర్టులు ఓఆర్ఆర్ వల్ల దగ్గరవుతాయి. అలాగే అమరావతి, విజయవాడ, గుంటూరు నుంచి గన్నవరం, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లకు చాలా సులభంగా చేరుకోవచ్చు. విశాఖ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే ట్రాఫిక్ విజయవాడను టచ్ చేయాల్సిన అవసరమే రాదు. అన్నింటికీ ఓఆర్ఆర్ చక్కటి పరిష్కారం. ఓఆర్ఆర్ బయట ఉన్న చాలా ప్రాంతాలను అర్బన్ నోడ్స్‌గా, మరికొన్నింటిని గ్రోత్ సెంటర్లుగా డెవలప్ చేయాలన్నది చంద్రబాబు ప్రభుత్వ లక్ష్యం. దీనికి తోడు 17 టౌన్‌షిప్‌లు డెవలప్ చేయాలన్న ప్రతిపాదన కూడా బాబు దగ్గర ఉన్నది.

ప్రజలిచ్చిన అధికారాన్ని ఈ ఐదేళ్ల పాటు అభివృద్ధి పనులకు కేటాయించి అప్పుల ఊబినుంచి ఏపీని గట్టెక్కించినట్లయితే చంద్రబాబు ప్రభుత్వానికి తిరుగుండదు. అన్నీ సవ్యంగా జరగాలని ఏపీ ప్రజలు కోరుకుంటున్నారు.

## కింగ్ పిన్.. కుట్రదారు అతడే..!

21న అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసింది. ప్రస్తుతం తీహార్ జైలులో ఉన్నాడు. జూలై 12న కేజ్రీవాల్‌ను వ్యక్తిగతంగా హాజరుపరచాలని కోర్టు ఆయనకు ఆదేశాలు జారీ చేసింది. ఛార్జ్ షీట్‌లో ఈడీ క్రైమ్ ప్రొసీడ్‌ను కూడా ప్రస్తావించింది. నిందితుడు వినోద్ చౌహాన్ మొబైల్ నుండి హవాలా నోట్ నంబర్ అనేక స్క్రీన్ షాట్‌లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. వీటిని గతంలో ఆదాయపు పన్ను కూడా స్వాధీనం చేసుకుంది. ఢిల్లీ నుంచి గోవాకు హవాలా ద్వారా వినోద్ చౌహాన్ అక్రమ సొమ్మును ఎలా బదిలీ చేస్తున్నాడో ఈ స్క్రీన్ షాట్లు కోర్టు ముందు ఉంచింది ఈడీ. ఈ డబ్బును ఆమ్ ఆద్మీ పార్టీ గోవా ఎన్నికల్లో ఉపయోగించినట్లు, హవాలా ద్వారా గోవాకు చేరిన డబ్బును అక్కడే ఉన్న చన్‌ప్రీత్ సింగ్ మేనేజ్ చేసినట్లు ఈ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ బెయిల్‌కు వ్యతిరేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దాఖలు చేసిన పిటిషన్‌ను జూలై 15న విచారణకు ఢిల్లీ హైకోర్టు జాబితా చేసింది. ఈ కేసులో కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేస్తూ దిగువ కోర్టు జూన్ 20న ఇచ్చిన ఉత్తర్వులపై హైకోర్టు గతంలో స్టే విధించింది. ఈ పిటిషన్‌ను విచారించాల్సిన జస్టిస్ నీనా బన్సాల్ కృష్ణ, మంగళవారం రాత్రి 11 గంటలకు కేజ్రీవాల్ ఇచ్చిన సమాధానం కాపీని దర్యాప్తు సంస్థకు అందింది. ఈడీ తన సమాధానం దాఖలు చేయడానికి కొంత సమయం కావాలని ఈడీ తరపు న్యాయవాది తెలియజేశారు.

# ధర్మాన్ని కాపాడే సత్తా ప్రజలకు మాత్రమే ఉంది

▶▶ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ కృతజ్ఞత సభలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్




**జయభేరి, హైదరాబాద్ :**

మల్కాజిగిరి ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా ఎన్నికలలో ఓట్లు వేశారని ఈ పార్లమెంట్ ఎన్నికలలో నిరూపించారు. ధర్మాన్ని కాపాడే సత్తా ప్రజలకు మాత్రమే ఉంటుంది. భారతదేశం మొత్తంలో బిజెపి ఓట్లు భారీగా పెంచుకున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ. ఈ విజయం బీజేపీ కార్యకర్తలకే అంకితం. మల్కాజిగిరి 15 అసెంబ్లీ నియోజకవర్గానికి సమానంగా చెప్పవచ్చు. తెలంగాణను 4 భాగాలుగా విభజిస్తే, అందులో సెంట్రల్ తెలంగాణలో 45 శాతం ఓట్లు సాధించింది బీజేపీ పార్టీనే. కాంగ్రెస్ సాధించింది 21 శాతం మాత్రమే. అందుకే రాబోయే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలలో అధికారంలోకి వచ్చేది బీజేపీ పార్టీనే అని ఘంటా పథంగా చెప్తున్నాను. కేసులు పెట్టి, జైలు పాలు చేసినా బీజేపీ నాయకులు, కార్యకర్తలు బాగా పని చేశారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు ప్రచారాలతో, డబ్బుతో బీజేపీకి రావలసిన అధికారాన్ని కాంగ్రెస్ గుంజుకుంది. దేశభద్రత, సమగ్రత కోసం బీజేపీ పార్టీకి, నరేంద్రమోదీకి మాత్రమే ఉందని ప్రజలు భావించి, పార్లమెంట్ ఎన్నికలలో ఓట్లు వేశారు. అతి తక్కువ సమయంలోనే ప్రజల్లో నమ్మకం కోల్పోయిన పార్టీ కాంగ్రెస్ పార్టీ, నాయకుడు రేవంత్ రెడ్డి. సోషల్ మీడియాలో, పేపర్లలో, టీవీలలో ప్రజలను మభ్యపెట్టేలా ప్రచారాలు చేస్తున్నారు. కానీ ప్రజలను మోసం చేయలేరు.

తెలంగాణలో రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే ప్రతీ సంవత్సరం రూ.2 లక్షల కోట్లు అవుతుంది. రేవంత్ రెడ్డి ఇప్పుడు రూ.10 వేల కోట్లు తేవచ్చు గాక, కానీ ప్రతీ సంవత్సరం ఈ హామీలను ఎట్టి పరిస్థితిలో అమలు చేయలేరు. మహిళలకు పెన్షన్లకు రూ.2,500 ఇస్తానని చెప్పి, ఇంతవరకూ ఇవ్వలేదు. రుణమాఫీ చేస్తానని ఆఖరుకు దేవునిపై ప్రమాణం చేశాడు రేవంత్ రెడ్డి. ఈ ఒక్కసారికి మాఫీ చేయడానికి ఖజానా ఖాళీ చేస్తున్నాడు. కేసీఆర్ హయాంలో ఉద్యోగాలు రావని ప్రచారం చేసి, కాంగ్రెస్ వల్లనే ఉద్యోగాలు వస్తాయని మభ్యపెట్టాడు. కానీ ఇప్పుడు ఒక్క ఉద్యోగం కూడా తేలేదు. నిరుద్యోగులు, వారి కుటుంబాలు అందరూ బాధలు పడుతున్నారు.

భారతీయ జనతా పార్టీ, యువమోర్చా మీకు అండగా ఉంటుందని హామీ ఇస్తున్నాను. నిరుద్యోగులు కేవలం ఒక నెల సమయం మాత్రమే అడుగుతున్నారు వారు చదువుకుని ప్రిపేర్ అవడానికి మాత్రమే. కానీ రేవంత్ రెడ్డి సమయం ఇవ్వకుండా వారిపై కేసులు పెడుతున్నారు. మూడవసారి మోదీ పూర్తి మెజారిటీతో గెలవలేదని ప్రతిపక్షాలు హేళన చేస్తున్నాయి. కానీ భారతీయ జనతా పార్టీ, మోదీ ప్రభంజనం ఏమాత్రం తగ్గలేదు. ప్రపంచవ్యాప్తంగా నేతలు ప్రధాని మోదీని చూసి ఈర్ష్యపడుతున్నారు. యుద్ధం జరిగే దేశాలకు వెళ్లి, శాంతి గురించి మాట్లాడే ధైర్యశాలి మోదీ. మూడవసారి వరుసగా ప్రధాని కావడం అంటే మామూలు విషయం కాదు. దేశంలో నెహ్రూ తర్వాత ఎవ్వరూ కాలేదు. దేశంలో పార్టీలన్నీ కలిపి కూడా బీజేపీ పార్టీ అంత పార్లమెంట్ సీట్లు రాలేదు.

240 సీట్లు ఎవ్వరికీ రాలేదు. కాంగ్రెస్ పాలనలో ఎప్పుడూ సంకీర్ణ రాజకీయాలే ఉండేవి. నేను ఎన్నికల ప్రచారంలో బీజేపీ పార్టీ ఎంత శక్తివంతమయ్యిందో గమనించాను. ఎర్రటి ఎండలో కూడా కార్యకర్తలు, మహిళలు బీజేపీ కోసం ప్రచారం చేశారు. ఈ విజయాన్ని చూసి గర్వపడడం లేదు. ప్రజలకు ఎక్కడ లాభం జరుగుతుందో అది కేంద్రం నుండి, రాష్ట్రం నుండి సాధించి తీరుతాను.

ఈ ప్రొటోకాల్స్ ఈ రోజు ఉంటాయి, రేపు పోతాయి. ఎలాంటి ఎన్నికలు వచ్చినా బీజేపీ విజయం సాధించే దిశగా ప్రచారాలు చేయాలి. జిల్లా పరిషత్, పంచాయితీ, కార్పొరేషన్ ఎన్నికలు అన్నింటిలో విజయం సాధించినప్పుడే పార్టీ సంపూర్ణ విజయం సాధిస్తుంది. అందుకే ప్రతీ ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకోవాలి. నాయకుడు వేరు వేరు గ్రూపులు ఏర్పాటు చేయవద్దు. కేవలం మనందరం బీజేపీ పార్టీకి చెందిన వాళ్లం మాత్రమే. మనందరికీ నాయకుడు బీజేపీ పార్టీ మాత్రమే. సమూహంగా, ఐకమత్యంతో ఉన్నప్పుడు మాత్రమే విజయాలు సాధించగలం. ప్రజాగర్భంలో పుట్టిన బీజేపీ పార్టీపై ఇష్టాన్ని పెంచుకొని గెలుపు తీరానికి చేర్చవలసిన బాధ్యత ప్రతీ కార్యకర్త మీదా ఉంది.

## డబుల్ ధమాకా డబ్బుల స్కీం..

మొదట్లో పెట్టిన పెట్టుబడికి రెట్టింపు డబ్బులు ఇచ్చి నమ్మించాడు. ఏకంగా గ్రామానికి చెందిన 10మంది ఏజెంట్లను పెట్టుకుని వారికి నెలకు రూ.16 వేల జీతం ఇస్తూ టార్గెట్ పెట్టుకున్నాడు. చింతపల్లి మండలంతోపాటు మర్రిగూడ, నాంపల్లి, యాచారం, ఇబ్రహీంపట్నం, కరీంనగర్, నిజామాబాద్, చౌటుప్పల్, హైద్రాబాద్ వరకు విస్తరించాడు. దీంతో మనీష్ రెడ్డి మనీ ట్రాప్ లోకి సామాన్యులే కాదు ప్రభుత్వ ఉద్యోగులు కూడా చేరిపోయారు. ఆశ అన్ని మరిచేలా చేస్తుంది. వేలు లక్షలు పెట్టుబడి పెట్టారు. అందరికీ ప్రామిసరీ నోట్లు రాసి ఇచ్చాడు. వందలాది మంది నుండి సుమారు రూ.40 కోట్లు కొల్లగొట్టాడు. కొంతకాలం కొందరికి ఇంటికి, వాహనాలకు లోన్లు ఇస్తానని నమ్మించాడు. ఆ తరువాత ఇదిగో అదిగో అంటూ కాలం వెళ్లదీసిన మనీష్ రెడ్డి 7 నెలలుగా వడ్డీ చెల్లించకుండా బోర్డు తిప్పేశాడు. మనీష్ రెడ్డి బాధితుల్లో ప్రభుత్వ ఉద్యోగులు, లెక్చరర్లు, స్టూడెంట్స్ ఉన్నారు. గ్రామానికి దూరంగా ఉంటూ బాధితులనుంచి తప్పించుకుంటూ తిరుగుతున్నాడు మనీష్ రెడ్డి. చాలామంది బాధితులు అత్యాశతో బంధువుల నుంచి అప్పుగా తీసుకొచ్చి లక్షల రూపాయలు మనీష్ రెడ్డి చేతులో పోశారు. కొద్ది రోజులుగా ఫోన్ స్విచాఫ్ చేయడంతో బాధితులకు అనుమానం కలిగింది. డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ మనిష్ రెడ్డి పై బాధితులు ఒత్తిడి పెంచారు. రెట్టింపు డబ్బులు దేవుడెరుగు తాము పెట్టిన పెట్టుబడి డబ్బులు ఇవ్వాలంటూ బాధితులు కోరుతున్నారు. పిల్లలు అవసరాల కోసం డబ్బులు వస్తాయని అత్యాశతో ఏజెంట్లతో మనిష్ రెడ్డి వద్ద పెట్టుబడి పెట్టామని బాధితులు లబోదిబోమంటున్నారు. తమకు న్యాయం చేయాలంటూ పోలీసులను కోరుతున్నారు.

మాల్ గ్రామానికి మనీష్ రెడ్డి వచ్చాడని తెలుసుకున్న బాధితులు తమ పెట్టుబడి డబ్బులు చెల్లించాలంటూ ఒత్తిడి చేశారు. వడ్డీ ఇవ్వకున్నా పర్వాలేదు అసలైనా ఇవ్వమని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. నా దగ్గర రూపాయి కూడా లేదు జైల్లో పెట్టుకుంటారా, చంపేస్తారా చంపేయండి అంటూ మొండికేశాడు. దీంతో తానే పోలీస్ స్టేషన్ మెట్ల ఎక్కాడు మనిష్ రెడ్డి. గ్రామస్తుల వేధింపులు భరించలేక పోతున్నానంటూ పోలీసులకు మొర పెట్టుకున్నాడు. కేసు నమోదు చేసి జైలుకు పంపాలని మనీష్ రెడ్డి స్వయంగా పోలీసులను ఆశ్రయించాడు. స్టాక్ మార్కెట్ పేరుతో మునిశ్ రెడ్డి మోసం చేశాడంటూ చాలామంది బాధితులు తమను ఆశ్రయిస్తున్నారని పోలీసులు చెబుతున్నారు. కేసు నమోదు చేసుకున్న విచారణ జరుపుతున్నామని చెబుతున్నారు. స్వల్పకాలంలో తక్కువ పెట్టుబడితో అధిక మొత్తం ఇస్తానని చెప్పేవారి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇలా ఎవరైనా మోసం చేసే ప్రయత్నం చేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని పోలీసులు ప్రజలకు సూచించారు..

ఈ కేసులో కొసమెరుపు ఏమిటంటే కొందరు రూ. లక్ష నుండి రూ. 10లక్షలు పెట్టుబడి పెడితే, ఒక ప్రైవేట్ బ్యాంకు మేనేజర్ సహా ఓ బ్యాంక్ క్యాషియర్ రూ. 60లక్షలు పెట్టుబడి పెట్టినట్లు తెలుస్తోంది. డబుల్ ధమాకా పేరుతో సామాన్యులను మోసం చేసిన మనిశ్ రెడ్డి.. https://99.com లో బెట్టింగ్ పెట్టి ఐదు కోట్ల రూపాయలు కోల్పోయినట్లు తెలుస్తోంది. పోలీసుల దర్యాప్తులో ఈ కేటుగాడు ఎన్ని కోట్లు కొల్లగొట్టాడో తేలనుంది. ఈజీ మనీ కోసం అత్యాశ పడకూడదని, ఇలాంటి సంఘటనలు రుజువు చేస్తున్నాయి. బి కేర్ ఫుల్.

## అస్సాంలో వరద బీభత్సం.. 92కు పెరిగిన మృతుల సంఖ్య



శుక్రవారం నాటికి 27 జిల్లాల్లో 18.80 లక్షల మంది ప్రభావితం కాగా.. మంగళవారం నాటికి ఆ సంఖ్య 17.70 లక్షలకు తగ్గింది. 38,870.3 హెక్టార్ల సాగు భూములు ముంపునకు గురయ్యాయి. 3,54,045 జనాభా కలిగిన ధుబ్రి జిల్లా ఈ వరదలకు తీవ్రంగా ప్రభావితమైంది. ఆ తర్వాత కాచర్ (1,81,545 మంది జనాభా), శివసాగర్ (1,36,547), బార్‌పేట (1,16,074), గోలాఘాట్ (1,09,475) వరద ప్రభావానికి గురైనట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 48,021 మంది బాధితులు 507 సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. సుమారు 1,04,665 మందికి అధికారులు సహాయక సామగ్రిని అందించారు.





**జయభేరి, అస్సాం జూలై 10 :**

అస్సాంలో వరద బీభత్సం కొనసాగుతోంది. ఈ వరదలు జన జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తున్నాయి. గత వారం రోజులుగా కురిసిన వర్షాలకు రాష్ట్రంలోని అన్ని నదులు ప్రమాదకరస్థాయిని మించి ప్రవహించాయి. అయితే, ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో ప్రధాన నదులు, వాటి ఉపనదుల్లో నీటి మట్టం తగ్గుముఖం పట్టినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 17.70 లక్షల మంది వరదలకు తీవ్ర ప్రభావితులయ్యారు. వరదల కారణంగా నిన్న ఒక్కరోజే ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. అస్సాం డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ ప్రకారం.. మంగళవారం ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. కాచర్‌లో ఇద్దరు మరణించగా.. ధుబ్రి, ధేమాజీ, సౌత్ సల్మారా, నాగావ్, శివసాగర్ జిల్లాల్లో ఒక్కొక్కరు చొప్పున ప్రాణాలు కోల్పోయారు. దీంతో ఈ ఏడాది వరదలు, కొండ చరియలు విరిగిపడటం, తుపానుల కారణంగా రాష్ట్రంలో మృతి చెందిన వారి సంఖ్య 92కు పెరిగింది. అందులో ఒక్క వరదల కారణంగానే 79 మంది ప్రాణాలు కోల్పోయారు.

**వరదలకు 17.70 లక్షల మంది ప్రభావితం..**

వరదల కారణంగా శుక్రవారం నాటికి 27 జిల్లాల్లో 18.80 లక్షల మంది ప్రభావితం కాగా.. మంగళవారం నాటికి ఆ సంఖ్య 17.70 లక్షలకు తగ్గింది. 38,870.3 హెక్టార్ల సాగు భూములు ముంపునకు గురయ్యాయి. 3,54,045 జనాభా కలిగిన ధుబ్రి జిల్లా ఈ వరదలకు తీవ్రంగా ప్రభావితమైంది. ఆ తర్వాత కాచర్ (1,81,545 మంది జనాభా), శివసాగర్ (1,36,547), బార్‌పేట (1,16,074), గోలాఘాట్ (1,09,475) వరద ప్రభావానికి గురైనట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 48,021 మంది బాధితులు 507 సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. సుమారు 1,04,665 మందికి అధికారులు సహాయక సామగ్రిని అందించారు.

**కజిరంగా పార్క్‌లో 159 వన్యప్రాణులు మృత్యువాత**

ప్రఖ్యాత కజిరంగా నేషనల్ పార్క్ ను ఇటీవలే కాలంలో ఎన్నడూ లేనివిధంగా వరదలు ముంచెత్తాయి. దీంతో మొత్తం 159 వన్యప్రాణులు మరణించాయి. 20 జంతువులు వరదలో కొట్టుకుపోయాయి. సుమారు 133 జంతువులను అధికారులు రక్షించి సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఈ వదరలకు రాష్ట్రంలో 13,66,829 జంతువులు ప్రభావితమయ్యాయి. వరదల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా 94 రోడ్లు పూర్తిగా దెబ్బతినగా.. మూడు వంతెనలు కొట్టుకుపోయాయి. 26 ఇళ్లు, ఆరు కట్టలు కూడా దెబ్బతిన్నాయి. ఇక నిమతిఘాట్, తేజ్‌పూర్, గౌహతి, ధుబ్రి వద్ద బ్రహ్మపుత్ర నది ప్రమాద స్థాయిని మించి ప్రవహిస్తోంది.

# ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటా..

» ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





మీర్పేట్ హెచ్ బి కాలనీ డివిజన్ లోని ఎన్టీఆర్ నగర్, అన్నపూర్ణ కాలనీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి విషయంలో అవసరమైన సహకారం అందిస్తూ ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని, ఉప్పల్ నియోజకవర్గం యొక్క అభివృద్ధికి పూర్తి స్థాయిలో కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే కాలనీవాసుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ మాట్లాడుతూ.. ఎల్లవేళలా డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. డివిజన్ అభివృద్ధి విషయంలో సహకారం అందిస్తున్న ఎమ్మెల్యేకి, డివిజన్ నాయకులకు కార్పొరేటర్ ప్రభుదాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ యొక్క అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం దశల వారీగా చేపట్టి పూర్తి కాలనీలో చేపడతామని అన్నారు. రాబోయే రోజుల్లో కూడా ఇంకా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకు వెళ్తామని అన్నారు. కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ, ఎమ్మెల్యేకి, కార్పొరేటర్ కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మధు ముదిరాజ్, వాసుచారి, భీష్మాచారి, మంజుల, రామాంజనేయులు, నరసింహ గౌడ్, సంజయ్ నాయక్, కుమార్, కృష్ణ, సత్తయ్య, రాంరెడ్డి, కృష్ణారావు, బోనాల శ్రీనివాస్, బోనాల మోహన్ రావు, మల్లేశ్ గౌడ్, ప్రసాద్, శంకరయ్య గౌడ్, యూసఫ్, చంద్ర శేఖర్, రామకృష్ణ, సత్యనారాయణ, సూరజ్, టిల్లు, మురళీకృష్ణ, రాజేష్, శ్యామ్ సుందర్, స్వామిగౌడ్, భద్రయ్య, మధు, శీను, శంకర్, బీరప్ప, శేఖర్ గౌడ్, నిసార్ అహ్మద్ గోరి, కాలనీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే

జయభేరి, కాప్రా :

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మీర్ పేట హౌసింగ్ బోర్డు కాలనీ డివిజన్ పరిధిలోనీ తిరుమలనగర్ మున్సిపల్ గ్రౌండ్లో, ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సంక్షేమ సంఘ నాయకులు మల్లేశ్ గౌడ్, సెక్రటరీ అమరేంద్ర బాబు, శ్రీనివాస రావు, మురళీకృష్ణ, రంగసాయి, చారి, కరుణాకర్ స్థానిక నాయకులు, గుమ్మడి జంపాల్ రెడ్డి, చారి, బాలరాజు, శేఖర్ గౌడ్, నిసార్ అహ్మద్ గోరి, విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సబ్ స్టేషన్ లో నూతనంగా ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు

» పరిశ్రమలు, గృహ అవసరాలకు మెరుగైన విద్యుత్ ను అందించనున్నట్లు ఏఈ శ్రీనివాస్ గౌడ్ వెల్లడి



జయభేరి, జులై 10:

మేడ్చల్ జిల్లా లాల్ గడి మలక్ పేట్ లోని విద్యుత్ సబ్ స్టేషన్ లో నూతనంగా ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేసినట్లు అలియాబాద్ విద్యుత్ ఏఈ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ ట్రాన్స్ ఫార్మర్ ను ఏర్పాటు చేయడం వలన తుర్కపల్లి జీనోమ్ వ్యాలీ మరియు శామీర్ పేట, మూడుచింతలపల్లి, మేడ్చల్ మండలంలోని ఇండస్ట్రియల్, కమర్షియల్ గృహ విద్యుత్ వినియోగదారుల కోసం మెరుగైన విద్యుత్ ను అందించనున్నట్లు వెల్లడించారు. విద్యుత్ సరఫరాలో ఏవైనా అంతరాయం కలిగిన ఫిర్యాదు చేయవచ్చునని వారు సూచించారు.

## మేడ్చల్ అభివృద్ధికి కృషి చేస్తా: మర్రి దీపికా



జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ మున్సిపాలిటీని అభివృద్ధిలో రాష్ట్రంలో ప్రధమ స్థానంలో నిలబెట్టేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని మేడ్చల్ మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహారెడ్డి అన్నారు. బుధవారం మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో గల 21వ వార్డులో రూపాయలు 20 లక్షలతో నిర్మిస్తున్న నూతన సిసి రోడ్డు పనులను గౌరవ చైర్ పర్సన్ మర్రి దీపిక నరసింహ రెడ్డి, స్థానిక కౌన్సిలర్ శ్రీమతి కృష్ణవేణి రవీందర్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సంధర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని కొనియాడారు. మాజీ శాసన సభ్యులు సుదీర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు హరివర్ధన్ రెడ్డి, కాంగ్రెస్ మేడ్చల్ శాసన సభ నియోజక వర్గ ఇంచార్జ్ శ్రీ వజ్రేష్ యాదవ్, నాయకులు శ్రీ నక్క ప్రభాకర్ గౌడ్ సహకారం మేడ్చల్ పట్టణ అభివృద్ధికి ఎంతగానో ఉందని అన్నారు. మౌలిక సధుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ను ఇస్తూ పట్టణంలో ప్రతి వార్డును అభివృద్ధి పరుస్తున్నట్లు తెలిపారు. నూతన సిసి రోడ్లు, బి టి రోడ్ల నిర్మాణాలతో ప్రజా రవాణా సౌకర్యాలను మెరుగు పరచామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, పట్టణ మాజీ ఉప సర్పంచ్ మర్రి నరసింహ రెడ్డి, నాయకులు రవిందర్ రెడ్డి, స్థానిక కాలనీ ప్రజలు, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రాంగ్ రూట్ లో వాహనాలు నడిపితే శిక్ష తప్పదు

» ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్



జయభేరి, మేడ్చల్ :

మనిషికి పేరు ఎంత అవసరమో, వాహనానికి నెంబర్ ప్లేట్ అంతే అవసరమని మేడ్చల్ ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్ అన్నారు. రాంగ్ రూట్ లో బైక్ లు, కార్లు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని మేడ్చల్ ట్రాఫిక్ సిఐ హనుమాన్ గౌడ్ వాహనదారులను హెచ్చరించారు. బుధవారం సిఐ మాట్లాడుతూ సైబరాబాద్ కమిషనర్ పరిధిలో రాంగ్ రూట్లో వాహనం నడిపిన వ్యక్తులకు సంబంధించి 150 కేసులు నమోదైనట్లు చెప్పారు. మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 6 కేసులు నమోదు చేశామని అన్నారు. నెంబర్ ప్లేట్ లేని, రాంగ్ రూట్ లో వాహనం నడిపిన వారిపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం 200 వాహనాల వరకు సీజ్ చేసి చాలన్లు వేసి కౌన్సిలింగ్ ఇచ్చామని చెప్పారు. వాహనాలకు నంబర్ ప్లేట్ కనిపించేలా పెట్టుకోవాలని సీఐ సూచించారు.. వాహనం రాంగ్ రూట్లో నడపడం ఎంత నేరమో వాహనానికి నంబర్ ప్లేట్ లేకుండా ఉండటం కూడా నేరమేనని పేర్కొన్నారు. వాహనాలతో రోడ్డెక్కేముందు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు.



## తుంకుంటలో ఓ గృహిణి అదృశ్యం

» కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

జయభేరి, జులై 10:

ఓ గృహిణి అదృశ్యమైన సంఘటన మేడ్చల్ జిల్లా తుంకుంట పరిధిలో చోటు చేసుకుంది. తుంకుంట కు చెందిన వ్యత్యావత్ రమేష్, అతని భార్య మన్ని కలిసి నివాసం ఉంటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ నెల 7న మధ్యాహ్న సమయంలో రమేష్ నిద్రపోగా తిరిగి లేచి చూడగా అతని భార్య మన్ని కనిపించలేదు. దీంతో అతను పరసర ప్రాంతాల్లో వెతకగా కనిపించలేదు. దీంతో రమేష్ స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. మన్ని 5.2 అడుగుల ఎత్తు, చామన ఛాయ రంగు, బ్లు కలర్ చీర ధరించి ఉన్నదని, తెలుగు, లంబాడీ భాష మాట్లాడ గలదని చెప్పారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మేడ్చల్ తహసీల్దార్ పై సీఎం కు పిర్యాదు



జయభేరి, మేడ్చల్ :

మేడ్చల్ తహసీల్దార్ పై గిర్మాపూర్ కు చెందినవారు ప్రజాపాలనలో మంగళవారం ఫిర్యాదు చేశారు. మేడ్చల్ మున్సిపాలిటి పరిధిలోని గిర్మాపూర్ కు చెందిన బాసురాది ఉమ సర్వే నెంబర్ 41లో 8 గుంటల భూమి తన వారసత్వంగా ఉందని తెలిపారు. తన భర్త మల్లేష్ తండ్రికి బాసురాది బాలయ్య, బాసురాది మల్లేష్, బాసురాది వీరయ్య ముగ్గురు కొడుకులు వారసురాలుగా ఉన్నారన్నారు. అందులో వారసత్వంగా ముగ్గురికి వాటా ఉండగా తహసీల్దార్ డబ్బులకు అమ్ముడుపోయి మల్లేష్, కృష్ణ చనిపోవడంతో కృష్ణ భార్య అయిన కళావతికి మొత్తం భూమిని పట్టాచేసి పాస్ బుక్కులు ఇచ్చారని ఆరోపించారు. గతంలో తహశీల్దార్ అభ్యంతరాలు తెలుపుతూ లిఖితపూర్వకంగా తెలియజేసిన పట్టించుకోలేదన్నారు. ఈ విషయంపై తహసీల్దార్ ను ప్రశ్నిస్తే పొరపాటు జగిందని, మేము ఇప్పుడు ఏమి చేయలేమని కోర్టుకు వెళ్లండని సలహాలు ఇచ్చారన్నారు. ఇద్దరు వారసులకు పట్టా చేసే సమయంలో మా కుటుంబ సభ్యులు నా సంతకాన్ని ఫోర్జరీ చేశారని ఆరోపించారు. తాను ఒంటరి మహిళని, రావాల్సిన వాటాకోసం కోర్టుల చుట్టూ తిరిగే స్థోమత లేదన్నారు. తనకు అన్యాయం చేసిన తహసీల్దార్ పై చర్యలు తీసుకొని, నాకు న్యాయంగా రావాల్సిన భూమిని ఇప్పించాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

## జర్నలిస్టులపై జరిగిన పోలీసుల దాడిని ఖండిద్దాం

» అత్యుత్సాహం ప్రదర్శించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి



జయభేరి, హైదరాబాద్ :

ఉస్మానియా యూనివర్సిటీలో విధి నిర్వహణలో ఉన్న జర్నలిస్టులను అమానుశంగా పోలీసులు లాక్కెళ్లడం అప్రజాస్వామికమని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, హెచ్ యుజె అధ్యక్షులు సిగ శంకర్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజులు ఘటనపై స్పందించారు.
ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. ఉస్మానియా యూనివర్సిటీలో నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనను కవర్ చేసేందుకు వెళ్లిన జీటీవీ ప్రతినిధి శ్రీ చరణ్ పై పోలీసులు అమానుషంగ ప్రవర్తించడం సిగ్గుచేటు అన్నారు. చొక్కా పట్టుకుని లాక్కెళ్లడమే కాకుండా, కెమెరాలను నిలిపివేయాలని బెదిరించడం దారుణమన్నారు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తూ జర్నలిస్టుల పట్ల దాడులకు పాల్పడడం అడపదడప జరుగుతూనే ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనను తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడిన పోలీసుల పట్ల చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

## మోడీ చేపట్టిన అభివృద్ధి పనులే బీజేపీ విజయానికి తొలిమెట్టు

» పార్లమెంటు ఎన్నికల్లో బిజెపికి మెరుగైన ఫలితాలు వచ్చాయి

» మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ కృతజ్ఞత సభకు.. హాజరైన ఎంపి ఈటెల



జయభేరి, జులై 10:

మేడ్చల్ జిల్లా తుంకుంట మున్సిపాలిటీ లోని ఎస్ఎన్ఆర్ పుష్ప కన్వేషన్ హాలులో మల్కాజ్ గిరి పార్లమెంట్ నియోజకవర్గ కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీ ఈటెల రాజేందర్ మాట్లాడారు. దేశ వ్యాప్తంగా చూసుకుంటే బిజెపికి తెలంగాణ రాష్ట్రం నుంచే భారీగా ఓట్లు వచ్చాయని తెలిపారు. ఈ విజయం బీజేపీ కార్యకర్తలకు అంకితం అని తెలిపారు. ఇదే విధంగా వచ్చే ఎన్నికల్లో కూడా బిజెపికి అధిక మెజార్టీ రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తంచేశారు. కేసులు పెట్టీ బెదిరించిన కూడా భయభ్రాంతులకు గురికాకుండా పార్టీ కార్యకర్తలు చురుగ్గా పనిచేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ అబద్ధపు ప్రచారాలు చేసి, డబ్బులతో అధికారం చేజిక్కించుకుందనీ ఆరోపించారు. దేశ భద్రత కేవలం నరేంద్ర మోడీ వల్లే సాధ్యమని అది నమ్మే ప్రజలు బీజేపీని గెలిపించుకున్నారని వెల్లడించారు. అతి తక్కువ సమయంలోనే ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన నాయకుడు రేవంత్ రెడ్డి అని, ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చి తీరా ఇపుడు ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ముఖం చాటేస్తున్నారనీ ఆరోపించారు. కేసీఆర్ హయంలో ఉద్యోగాలు రావని, కాంగ్రెస్ వల్లే సాధ్యమని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెప్పాలనీ డిమాండ్ చేశారు. దేశంలో మోడీ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రపంచ దేశాలు సైతం భారత దేశాన్ని చూసి గర్విస్తున్నాయని చెప్పారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధులు ఇంకా పథకాలు అన్ని తీసుకువస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా వచ్చే ఎన్నికల్లో కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుగ్గా పనిచేసి బీజేపీని గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్ గిరి పార్లమెంట్ ఇంచార్జ్ ఆర్ కె శ్రీనివాస్, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, శామీర్ పేట్ మాజీ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, ఎన్వీఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే భేతి సుభాష్ రెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల మోర్చ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నిజమైన రైతులకే రైతుభరోసా అందాలి : మంత్రి తుమ్మల

జయభేరి, ఖమ్మం న జూలై 10 :

నిజమైన రైతులకే రైతుభరోసా అందాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా నుంచి రైతుభరోసా సదస్సులకు శ్రీకారం చుట్టినట్లు మంత్రి చెప్పారు. ఖమ్మం కలెక్టరేట్ లో రైతుభరోసా విధివిధానాలపై అభిప్రాయాల సేకరించినట్లు తెలిపారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో అభిప్రాయాలు సేకరణ జరిగిందని వెల్లడించారు.
ప్రజల ఆలోచనల మేరకు ప్రభుత్వం ముందు కెళ్తుందని తుమ్మల అన్నారు. గతంలో జరిగిన ఆర్థిక నష్టాన్ని ప్రజలు గమనించారని వ్యాఖ్యానించారు. చిన్న, సన్నకారు రైతులకు చేయూత నిచ్చేందుకే ఈ కార్యక్రమం చేపట్టామని వివరించారు. రైతుల అభిప్రాయాల సేకరణ తర్వాతే ప్రభుత్వ నిర్ణయం ఉంటుందని చెప్పారు.



# మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య యత్నం

- మైసమ్మగూడ సాయి బాలాజీ హాస్టల్ లో ఘటన

**జయభేరి, మేడ్చల్ :**

మనస్తాపంతో విద్యార్థి ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఘటన పెట్ భాషిరాబాద్ పరిదిలోని మైసమ్మగూడలో చోటు చేసుకుంది. మల్లారెడ్డి అగ్రికల్చర్ కళాశాల లో మూడవ సంవత్సరం చదువుతున్న హరనాథ్ మైసమ్మగూడలోని పూజ రెడ్డి బాయ్స్ హాస్టల్ లో ఉంటున్నాడు. గత మూడు రోజుల క్రితం కళాశాలలో జరిగిన చిన్న గొడవ కారణంగా మనస్తాపం చెందిన హరనాథ్ బుధవారం హాస్టల్ గదిలో ఎవరు లేని సమయంలో పురుగుల మందు సేవించి హాస్టల్ భవనం నుండి దూకి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. భవనం పై నుండి దూకే సమయంలో విద్యుత్ వైర్లు తగలడంతో యువకుడికి తీవ్ర గాయాలు అయ్యాయి. యువకుడిని స్థానికులు కొంపల్లి లోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకుని పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

**హాస్టల్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి:- ఎస్సై ప్రవీణ్**

మైసమ్మగూడలో ప్రయివేటు హాస్టల్ వ్యాపారం చేస్తున్న యజమానులు కొన్ని నిబంధనలు పాటిస్తూ విద్యార్థుల పూర్తి వివరాలు తీసుకోవాలని పెట్ భాషిరాబాద్ ఎస్సై ప్రవీణ్ అన్నారు. యూనివర్సిటీలో చదువుతున్న విద్యార్థులు వసతి కోసం హాస్టల్ లో చేరినప్పుడు విద్యార్థుల ఆధార్ కార్డు, కుటుంబ సభ్యుల వివరాలు, కళాశాలో చదువుతున్న వివరాలు తీసుకోవాలని సూచించారు. అలాగే విద్యార్థుల కదలికలపై దృష్టి పెట్టలన్నారు. రాత్రి సమయంలో హాస్టల్ విద్యార్థులు సమయపాలన పాటించే విదంగా హాస్టల్ నిర్వాహకులు చూసుకోవాలని పేర్కొన్నారు. హాస్టల్ భవనంలో సిసి టివి కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై పేర్కొన్నారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలకు బీమా ధీమా

- పార్టీలో సభ్యత్వం పొంది మృతి చెందిన కార్యకర్త కుటుంబానికి రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును అందించిన జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**జయభేరి, దేవరకొండ :**

బీఆర్ఎస్ పార్టీ తమ కార్యకర్తలకు అండగా ఉంటుందని బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ భరోసా ఇచ్చారు. దేవరకొండ పట్టణానికి చెందిన బీఆర్ఎస్ పార్టీలో క్రియాశీలక సభ్యత్వాన్ని పొందారు. కుక్కముడి వీరయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుక్కముడి వీరయ్య బీఆర్ఎస్ లో సభ్యత్వాన్ని పొందిన వీరయ్య కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ బాసటగా నిలిచింది. బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి అందిన రూ.2 లక్షల బీమా చెక్కును నామినీ కుక్కమూడి పార్వతమ్మకు మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ దేవరకొండ పట్టణములో 11వ వార్డులో ఇంటి వద్దకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమ పార్టీ నుంచి ప్రస్థానం ప్రారంభించి రాజకీయ పార్టీగా మారిన బీఆర్ఎస్ పార్టీ తమ కార్యకర్తలందరికీ అండగా నిలుస్తుందని వారు భరోసా ఇచ్చారు. కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్టం అభివృద్ధి పథంలో పయనించిందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీలో రూ.100 చెల్లించి క్రియాశీలక సభ్యత్వం పొందిన కార్యకర్తలెవరైనా ప్రమాదవశాత్తు మృతి చెందినట్లైతే నామినికీ రూ.2 లక్షల బీమా చెక్కును బీఆర్ఎస్ పార్టీ అందజేస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ, సోషల్ మీడియా మండల అధ్యక్షులు వాజీద్ పాషా, మైబెల్లి, కామోజీ మురళి, బాలరాజు తదితరులు ఉన్నారు.

# వ్యవసాయ అనే పదంలో సాయం ఉంది

- అగ్రికల్చర్ అనే పదంలో కల్చర్ ఉంది
- ప్రపంచానికి కల్చర్ ని సహాయం చేసే గుణాన్ని నేర్పిన ఒకే ఒక వ్యక్తి రైతు
- మైత్రి ఉత్పత్తిదారుల సంఘం గోదాం భూమి పూజ శంకుస్థాపనలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలు నాయక్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మండలంలోని మర్రిచెట్టు తండా గ్రామంలో నాబార్డ్, ట్రైకర్, ఆర్ ఓ సంస్థ వారు ఏర్పాటు చేసిన మైత్రి ఉత్పత్తిదారుల సంఘం గోదాం భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ దేవరకొండ సర్పంచుల ఫోరం అధ్యక్షులు గ్రామ మాజీ సర్పంచ్ శ్రీను నాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిప్పర్తి రుక్మా రెడ్డి, మైనంపల్లి మాజీ ఎంపిటిసి కొర్ర గౌతమి రాంసింగ్ నాయక్, మాజీ ఎంపీటీసీ సీత్య నాయక్, నాబార్డ్ జిల్లా మేనేజర్ వినయ్ కుమార్, సీఈఓ ఖాజా ఖైరత్ అలీ, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కిన్నెర హరికృష్ణ, పలువురు గ్రామ సర్పంచులు దీప్లా నాయక్, లక్ష్మ నాయక్, ఆంజనేయులు, అంజయ్య, పాండు నాయక్, మాజీ ఉప సర్పంచులు శ్రీను నాయక్, చిన్న నాయక్, గ్రామ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అందరం కలిసి క్యాన్సర్ ను జయిద్దాం

- క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడం ఒక్కటే మార్గం : సైబరాబాద్ పోలీస్ కమిషనర్
- గ్రేస్ క్యాన్సర్ రన్ 2024 కోసం రేస్ తేదీ, థీమ్ మరియు రిజిస్ట్రేషన్లను ప్రారంభించిన సీపీ సైబరాబాద్ అవినాష్ మొహంతి
- ఫిజికల్, వర్చువల్ మోడ్‌ల ద్వారా 130 దేశాల నుండి 1 లక్ష మంది పాల్గొనే ఈ రన్ అక్టోబర్ 6న
- ఇది ప్రపంచంలోనే అతిపెద్ద క్యాన్సర్ అవగాహన రన్
- గ్రేస్ ఫౌండేషన్ గతేడాది క్యాన్సర్ స్క్రీనింగ్ ద్వారా 40,000 మంది పేదల ప్రాణాలను కాపాడింది.
- రన్ ద్వారా సేకరించిన నిధుల ద్వారా ఈ సంవత్సరం లక్ష మందిని పరీక్షించడం చాలా మంది ప్రాణాలను కాపాడటం లక్ష్యం
- గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ అవగాహన పెంచడానికి, ముందస్తుగా గుర్తించి ప్రోత్సహించడానికి, క్యాన్సర్‌ను ఎదుర్కోవడానికి, పరిశోధనలకు నిధులు సమకూర్చడానికి అంకితం




**జయభేరి, సైబరాబాద్, జూలై 10 :**

గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ ద్వారా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న క్వాంబియంట్ గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్ 2024 క్యాన్సర్ పరిశోధన, స్క్రీనింగ్ కోసం అవగాహన, నిధులను సేకరించడానికి వేలాది మంది పాల్గొనేవారిని ఒకచోట చేర్చే పరుగు గ్రేస్ క్యాన్సర్ పరుగు 2024 ప్రకటించబడింది. ఇది HYSEA (Hyderabad Software Enterprises Association), SCSC (సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్) అనేక ఇతర సంస్థల భాగస్వామ్యంతో నిర్వహించబడుతున్న ప్రపంచంలోనే అతి పెద్ద క్యాన్సర్ అవగాహన పరుగు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో బుధవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో రేస్ తేదీ, థీమ్, రిజిస్ట్రేషన్ల ప్రారంభోత్సవాలను డి.జోయెల్ డేవిస్, IPS., Jt CP (ట్రాఫిక్)తో కలిసి పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి IPS ఆవిష్కరించారు.

అక్టోబరు 6న రన్ జరగనుంది, ఫిజికల్, వర్చువల్ మోడ్‌ల ద్వారా 130 దేశాల నుండి 1 లక్ష మందికి పైగా పాల్గొనే అవకాశం ఉంది. ఈ సంవత్సరం థీమ్, "రన్ ఫర్ గ్రేస్ స్క్రీన్ ఫర్ లైఫ్", క్యాన్సర్‌పై పోరాటంలో ముందస్తుగా గుర్తించడం. నివారణ చర్యల యొక్క ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథి అవినాష్ మొహంతి IPS మాట్లాడుతూ.. "గ్రేస్ క్యాన్సర్ రన్ 2024కి మద్దతు ఇవ్వడం నాకు గౌరవంగా భావిస్తున్నాను. మనం కలిసి, అవగాహన, ముందస్తుగా గుర్తించడం ద్వారా మార్పును తీసుకురావచ్చు, ప్రాణాలను కాపాడుకోవచ్చు." క్యాన్సర్ బారిన పడని కుటుంబం ఏదీ లేదని అన్నారు. ఇది ఇప్పుడు చాలా ప్రబలంగా ఉంది. ఇది వైద్యపరంగా మానసికంగా కుటుంబాలను ప్రభావితం చేయడమే కాకుండా ఆర్థికంగా కూడా చాల ఇబ్బందులకు గురి చేస్తుంది. ముందస్తుగా గుర్తించడం దానిని కలిగి ఉండటానికి ఉత్తమ మార్గం. గ్రేస్ క్యాన్సర్ ముందస్తుగా గుర్తించే యాక్సెస్ లేని వ్యక్తులకు చేరువవుతోంది. ఇది చాలా అభినందనీయం. ఇది మానవాళికి గొప్ప సేవ అని ఆయన అన్నారు. ముఖ్య అతిథి అవినాష్ మొహంతి IPS, పోలీస్ కమిషనర్, సైబరాబాద్. అతని ఉనికి క్యాన్సర్‌పై మా సామూహిక పోరాటంలో సమాజ ప్రమేయం. మద్దతు యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది, అని సీనియర్ కన్సల్టెంట్ రోబోటిక్ సర్జికల్ ఆంకాలజిస్ట్, గ్రేస్ (గ్లోబల్ రీసెర్చ్ అండ్ క్యాన్సర్ ఎడ్యుకేషన్) క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ చిన్నబాబు సుంకవల్లి అన్నారు. రేస్ కేటగిరీలు 2k నడక, 5k ఫన్ రన్ & 10k (సమయ పరుగు). హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరగనుంది. రిజిస్ట్రేషన్ల కోసం, దయచేసి వెబ్‌సైట్‌ను సందర్శించండి www.gracecancerrun.com ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోండి. డాక్టర్ చినబాబు మాట్లాడుతూ.. గ్రేస్ క్యాన్సర్ రన్ కేవలం రేసు కంటే ఎక్కువ, ఇది అవగాహన, విద్య, ముందస్తుగా గుర్తించడం ద్వారా ప్రాణాలను రక్షించడానికి అంకితమైన ఉద్యమం. పాల్గొనడం ద్వారా, మీరు కీలకమైన క్యాన్సర్ స్క్రీనింగ్ ప్రోగ్రామ్‌లు, పరిశోధన కార్యక్రమాలకు సహకరిస్తారు అన్నారు. క్యాన్సర్ లేని ప్రపంచాన్ని చూడాలనుకుంటున్నాం. భారతదేశంలో దాదాపు 80% మరణాలకు నాలుగు ఆరోగ్య సమస్యలే కారణం. అవి క్యాన్సర్, గుండె, ఊపిరితిత్తులు, మధుమేహం, అని ఆయన చెప్పారు. రన్ నుండి వచ్చిన నిధులతో, మేము గత సంవత్సరం 40,000 మంది పేద, గ్రామీణ జనాభాను పరీక్షించాము. ఈ ఏడాది లక్ష మందిని ఉచితంగా పరీక్షించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. క్యాన్సర్ సర్జన్‌గా, నాకు వారి నొప్పి, బాధ తెలుసు. నేను ఈ కారణంపై పూర్తి సమయం పని చేస్తున్నాను. నా జీవనం కోసం పార్ట్ టైమ్‌గా డాక్టర్‌గా పని చేస్తున్నాను అన్నారు. క్యాన్సర్‌తో పోరాడడంలో నేను రెండు సమస్యలను చూశాను. ఒకటి తక్కువ అవగాహన, రెండవది ముందస్తుగా గుర్తించే అవకాశం లేకపోవడం. మేము ఆరేళ్ల క్రితం 5000 మందితో పరుగు ప్రారంభించాము. గతేడాది లక్ష మందిని తాకింది. ఈ ఏడాది దాటాలనుకుంటున్నాం అన్నారు. ఎస్‌సిఎస్‌సి సెక్రటరీ జనరల్ రమేష్ కాజా మాట్లాడుతూ, తన తల్లి క్యాన్సర్‌తో బాధపడిందని చాలా ఆలస్యంగా నిర్ధారణ కావడంతో ఆమెను రక్షించలేకపోయారని చెప్పారు. క్యాన్సర్‌తో బాధపడుతున్న వారి కుటుంబ సభ్యుల బాధను అనుభవించే వ్యక్తులకు వారి బాధ మాత్రమే తెలుస్తుంది. ఇంకా మాట్లాడుతూ.. క్యాన్సర్ నిపుణుడి నుండి తాను క్యాన్సర్‌ను నిర్మూలించే లక్ష్యంలో ఉన్నానని చెప్పడం చాలా ఆశ్చర్యంగా ఉందని, మరో మాటలో చెప్పాలంటే, ఇది తన ఉద్యోగాన్ని పోగొట్టుకోవడమే అనే, అయినప్పటికీ, అతను పెద్దగా పట్టించుకోడని అన్నారు. ఒక వైద్యుడు ఇలా చెప్పడం చాలా బాగుంది అన్నారు. రోగనిర్ధారణ, గుర్తింపు చాలా ముఖ్యమని HYSEA (హైదరాబాద్ సాఫ్ట్‌వేర్ ఎంటర్‌ప్రైజెస్ అసోసియేషన్) అధ్యక్షుడు ప్రశాంత్ నందేళ్ల అన్నారు. అవగాహన కల్పించడం ద్వారానే అది సాధ్యం. గ్రేస్ ఫౌండేషన్ క్యాన్సర్ స్క్రీనింగ్ ద్వారా చాలా మంది ప్రాణాలను కాపాడింది. చాలా మంది IT ఉద్యోగులతో HYSEA మరింత మంది జీవితాలను రక్షించడానికి వారి ప్రయత్నాలను విస్తరించవచ్చు. గతంలో రికార్డు స్థాయిలో పాల్గొనే వారి సంఖ్యను అధిగమించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు రేస్ డైరెక్టర్ కృపాకర్ రెడ్డి తెలిపారు. అతను పరుగు యొక్క మూడు కేటగిరీలలో ప్రతి దాని స్వంత థ్రిల్స్‌ను కలిగి ఉంటాడు మరియు పెద్ద సంఖ్యలో పాల్గొని, అందులో చేరాలని ఆయన కోరారు. మరింత సమాచారం కోసం, దయచేసి www.gracecancerfoundation.orgని సందర్శించండి. క్రింది వెబ్‌సైట్‌ల నుండి గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ గురించి మరింత చూడండి.

https://gracecancerfoundation.org/
https://gracecancerrun.com



# పదవి విరమణ ఆత్మీయ అభినందన సభ

**జయభేరి, ఘట్కేసర్ :**


పోచారం మున్సిపల్ పరిధిలోని ఎస్బిఆర్ ఫంక్షన్ హాల్ లో జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి పదవి విరమణ ఆత్మీయ అభినందన సభలో బుధవారం పాల్గొన్న చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. విజయలక్ష్మి సేవలు అభినందనియమని వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తో పాటు కౌన్సిలర్ బలాగొని వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచులు బాలగోని చిన్న నరసింహులు గౌడ్, గాంధారి లక్ష్మీనరయాన, నాయకులు అఖిటి బల్ రెడ్డి, సింగిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మెట్టు నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు స్వరూప రాణి, కవిత, రాందాస్, అనురాధ, భాషయ్య, భావని, అమరేస్వారీ, పలువురు ప్రముఖులు విద్యార్థిని విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# 8 ఏళ్ల చిన్నారిపై హత్యాచారం

**జయభేరి, కర్నూలు, జూలై 10:**

నంద్యాల జిల్లాలో ఎనిమిదేళ్ల చిన్నారిపై ముగ్గురు మైనర్ బాలురు అత్యాచారం చేయడమే కాకుండా హత్య చేసి మృత దేహాన్ని కృష్ణానదిలో పడేశారు. ఈ ఘటన పెను సంచలనం రేపుతోంది. నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గం పగిడిరాల మండలం ముచ్చుమర్రి గ్రామానికి చెందిన వాసంతి అందరి పిల్లలతో పాటు ఆదివారం గ్రామ వీధుల్లో ఆడుకుంటూ ఉంది. అదే గ్రామానికి చెందిన ముగ్గురు బాలురు వాసంతికి ఆడుకుందామని మాయ మాటలు చెప్పి జనావాసం లేని ప్రదేశానికి తీసుకెళ్లారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల ప్రాజెక్టు దగ్గర నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లారు. ఆ చిన్నారిపై దారుణంగా అత్యాచారానికి పాల్పడ్డారు. వారి అఘాయిత్యాన్ని భరించలేక ఆ పాప కన్నుమూసింది. వాసంతి చనిపోవడంతో ముగ్గురు బాలురు భయపడి పక్కనే ఉన్న కృష్ణ నదిలోకి ఆ చిన్నారి మృతదేహాన్ని పడేశారు. ఏమి తెలియనట్లుగా ఇంటికెళ్లిపోయారు. అప్పటి వరకూ ఆడుకుంటున్న పాప కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే పిల్లలతో ఆడుకుంటూ ఎటో వెళ్లి ఉంటుంది లే తిరిగి వస్తుందని నిర్లక్ష్యం చేశారు. అయితే రోజు గడిచిపోయినా రాకపోవడం.. పోలీసులు పట్టించుకోకపోవడంతో పాప తల్లిదండ్రులు నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరిని ఆశ్రయించారు. ఎంపీ పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడి.. హుటాహుటిన వాసంతి మిస్సింగ్ కేసును నమోదు చేసుకుని గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం చిన్నారి ఎక్కడెక్కడకు వెళ్లింది అన్న కోణంలో పోలీసులు విచారణ చేపట్టారు. డాగ్ స్క్వాడ్‌తో పాప ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. డాగ్ స్క్వాడ్ పాపపై అఘాయిత్యానికి పాల్పడిన ప్రాంతాన్ని గుర్తించింది. అక్కడ ఉన్న ఆధారాలను పోలీసులు సేకరించి విచారణ చేయడంలో సంచలన విషాయలు వెలుగులోకి వచ్చాయి. ఘటనా స్థలంలో లభించిన ఆధారాలతో పోలీసులు విచారణ జరిపి ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు విస్తు పోయే నిజాలు చెప్పారు. ఆదివారం గ్రామ వీధుల్లో ఆడుకుంటున్న చిన్నారిని తీసుకెళ్లి అత్యాచారం చేసినట్లు ఆ యువకులు పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు.



# భక్తుల వద్దకు సాక్షాత్తు పూరీ జగన్నాధుడు

- జగన్నాథుని రథయాత్రలో పాల్గొనడం వల్ల అన్ని తీర్థయాత్రల్లో పాల్గొన్న ఫలితం.
- పురాణాల ప్రకారం, జగన్నాథుడు అంటే విశ్వం మొత్తానికి నాథుడు లేదా ప్రపంచానికి ప్రభువు అని అర్థం
- కూకట్ పల్లి ఇస్కాన్ టెంపుల్ వారి సౌజన్యంతో దేవరకొండలో పూరీ జగన్నాథ రథయాత్ర
- అంగరంగ వైభవంగా రథయాత్ర ప్రారంభించిన దేవరకొండ భక్తులు

**జయభేరి, దేవరకొండ :**

పట్టణంలో దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్ బుధవారం రోజు శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం నుండి పూరి జగన్నాథ రథయాత్ర ను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఒరిస్సా రాష్ట్రంలో జూలై మొదటి వారంలో పూరి జగన్నాథ రథయాత్రలో లక్షలాదిమంది ప్రజలు పాల్గొంటారని, దానిలో భాగంగా తెలంగాణలోని మూడు జిల్లాలలో కార్యక్రమం నిర్వహిస్తున్నారని దేవరకొండ పూరి జగన్నాథ శ్రీకృష్ణుడు రథయాత్ర కమిటీ పి ఎస్టీ లు తెలిపారు. అంతటి గొప్ప రథోత్సవం మన దేవరకొండ పట్టణంలో నిర్వహించుకోవడం ఈ ప్రాంత ప్రజలకు అదృష్టమని అన్నారు. పురాణాల ప్రకారం, జగన్నాథుడు అంటే విశ్వం మొత్తానికి నాథుడు లేదా ప్రపంచానికి ప్రభువు అని అర్థం. ప్రతి సంవత్సరం కొత్త కలపతో రథాన్ని తయారు చేయడం ఈ రథయాత్ర ప్రత్యేకత అని, ఈ జగన్నాథుని రథయాత్రలో పాల్గొనడం వల్ల అన్ని తీర్థయాత్రల్లో పాల్గొన్న ఫలితాలు వస్తాయని అని అన్నారు. అయ్యప్ప స్వామి దేవాలయం నుండి బ్రహ్మాండమైన ఊరేగింపుతో బయలుదేరి మహిళల మంగళహారతులతో, నీటి బిందెలతో ఆరగింపు మహిళల కోలాట బృందములతో, భక్తుల సంకీర్ణలతో, చిన్నారుల కృష్ణుని, సుభద్ర వేషధారణలో భజనలతో వేలాది భక్తులు మధ్య నగర ప్రధాన వీధుల గుండా రథయాత్ర జరిగింది రథయాత్ర అనంతరం పూరి జగన్నాథ హారతి కార్యక్రమం సాయి శివ గార్డెన్ లో ఏర్పాటు చేశారు. మీనాక్షి హోటల్ బస్టాండ్ మున్సిపల్ కోర్టు కొండలరావు బంగ్లా వరకు రథయాత్రలో భక్తుల సందడితో సాగింది.. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు రథయాత్ర కమిటీ వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూరి జగన్నాథ శ్రీకృష్ణుడు రథయాత్ర దేవరకొండ కమిటీ చైర్మన్ నీలా పాండరయ్య, కో చైర్మన్ చిలువేరు చంద్రమౌళి, పున్న వెంకటేశ్వర్లు, అధ్యక్షులు చిదేళ్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి నక్క వెంకటేష్ యాదవ్, కోశాధికారి పెండ్కర్ నాగేశ్వరరావు సాంస్కృతిక కార్యదర్శి నీల సంజీవ్ కుమార్, కర్ణాటి పురుషోత్తం, జెల్లా భాస్కర్, దేవరకొండ భక్తజనం తదితరులు పాల్గొన్నారు.

# సురక్షిత ప్రయాణం ఆర్టీసీతోనే సాధ్యం

- దేవరకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ గా తల్లాడ రమేష్
- కరీంనగర్ అసిస్టెంట్ వర్క్ మేనేర్ గా పనిచేస్తున్న రమేష్ బాబు డియంగా పదోన్నతి

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ సురక్షిత ప్రయాణం ఆర్టీసీతోనే సాధ్యమవుతుందని దేవరకొండ ఆర్టీసీ నూతన డీఎం తల్లాడ రమేష్ అన్నారు. బుధవారం డియంగా పదవి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన డి యం రాజు ప్రేమ్ కుమార్ పదవి విరమణ పొందడంతో ఆయన స్థానంలో కరీంనగర్ అసిస్టెంట్ వర్క్ మేనేర్ గా పనిచేస్తున్న రమేష్ బాబు డియంగా పదోన్నతిపై దేవరకొండకు వచ్చారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్, డిపో సిబ్బంది అధికారులు పూల బొక్కలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డియం మాట్లాడుతూ.. సురక్షిత ప్రయాణం ఆర్టీసీతోనే సాధ్యమని, ప్రైవేట్ వాహనాల కన్నా ఆర్టీసీ బస్సులో ప్రయాణమే శ్రేయష్కరమన్నారు. అతి



తక్కువ చార్జీలతో క్షేమంగా ప్రయాణీకులు ఇంటికి చేరుస్తున్నామని తెలిపారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం ఎల్లప్పుడూ సురక్షితమని ఆయన పేర్కొన్నారు. ప్రజలందరూ ఎల్లప్పుడూ ఆర్టీసీ బస్సు లలోనే ప్రయాణించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, డిపో అధికారులు, కార్మిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# భారత్ ఘన విజయం..

## సిరీస్‌లో ముందంజ

జింబాబ్వే పర్యటనలో యువ భారత్ వరుస విజయాలతో దూసుకుపోతుంది. ఆతిథ్య జట్టుతో హరారే వేదికగా జరిగిన మూడో టీ20లో 23 పరుగుల తేడాతో గెలుపొందింది. భారత్ నిర్దేశించిన 183 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జింబాబ్వే 159 6 వద్దే ఆగిపోయింది. ఆ జట్టులో డియోన్ మైయర్స్ (49 బంతుల్లో 65 నాటౌట్, 7 ఫోర్లు, 1 సిక్సర్), క్లైవ్ మదండె (26 బంతుల్లో 37, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) రాణించారు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్ (315), అవేశ్ ఖాన్ (239) రాణించారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 21తో ముందంజ వేసింది. వాషింగ్టన్ సుందర్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. భారీ ఛేదనలో జింబాబ్వేకు రెండో ఓవర్లోనే షాక్ తగిలింది. అవేశ్ ఖాన్ వేసిన ఆ ఓవర్లో ఓపెనర్ వెస్లీ మద్వెరె (1) అభిషేక్ శర్మకు క్యాచ్ ఇచ్చాడు. మరుమని (13)ని ఖలీల్ అహ్మద్ 3వ ఓవర్లో పెవిలియన్‌కు పంపాడు. ప్రమాదకర బ్రియాన్ బెన్నెట్ (4)ను అవేశ్ ఖాన్ ఔట్ చేయగా కెప్టెన్ సికందర్ రజా (15) మరోసారి విఫలమయ్యాడు. జొనాథన్ క్యాంప్‌బెల్ (1) నిరాశ పరిచాడు.

ఈ రెండు వికెట్లూ సుందర్ ఖాతాలోకే వెళ్లాయి. భారత బౌలర్ల ధాటికి జింబాబ్వే 7 ఓవర్లకే 5 కీలక వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. 39 పరుగులకే 5 వికెట్లు నష్టపోయిన జింబాబ్వేను మైయర్స్, క్లైవ్ ఆదుకున్నారు. ఈ ఇద్దరూ భారత బౌలర్లను సమర్థంగా అడ్డుకున్నారు. వేగంగా ఆడకపోయినా వికెట్లను కాపాడుకున్నారు. ఐదో వికెట్‌కు 77 పరుగులు జోడించిన ఈ జోడీని ఎట్టకేలకు సుందర్ విడదీశాడు. 17వ ఓవర్లో క్లైవ్ రింకూ సింగ్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఆ తర్వాత జింబాబ్వే బ్యాటర్ల పోరాటం ఆ జట్టు ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించింది. అంతకుముందు ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన భారత్.. నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 182 పరుగులు చేసింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (66), రుతురాజ్ గైక్వాడ్ (49), యశస్వీ జైస్వాల్ (36) రాణించారు. ఇరుజట్ల మధ్య నాలుగో టీ20 ఈనెల 13న (శనివారం) ఇదే వేదికపై జరుగనుంది.

# పీరియడ్స్ సమయంలో పొట్టనొప్పి అసౌకర్యంగా ఉందా?



నెలసరి సమయంలో కొంతమంది మహిళలకు విపరీతమైన పొట్టనొప్పి వస్తుంది. పొట్ట అసౌకర్యంగా అనిపిస్తుంది. ఇలాంటివారు పీరియడ్స్ వస్తుంటేనే భయపడిపోతారు. అలాంటి వారికి రోజ్ టీ ఎంతో మేలు చేస్తుంది.

మహిళ ఆరోగ్యానికీ, పీరియడ్స్ కు ఎంతో అనుబంధం ఉంది. ప్రతినెలా క్రమం తప్పకుండా మహిళకు నెలసరి వస్తుంటే ఆమె ఆరోగ్యం చక్కగా ఉన్నట్టు. ముఖ్యంగా పునరుత్పత్తి వ్యవస్థ ఆరోగ్యంగా ఉన్నట్టు లెక్క. అయితే నెలసరి సమయంలో కొంతమంది స్త్రీలకు విపరీతమైన పొట్టనొప్పి, ఒళ్ళు నొప్పులు వస్తుంటాయి. ముఖ్యంగా పొట్ట దిగువ భాగంలో అంటే పొత్తికడుపులో నొప్పి వస్తూ ఉంటుంది. ఆ నొప్పి వీపు, తొడలకు కూడా ప్రవహిస్తుంది. కొంతమందికి సూదితో గుచ్చినట్టు తీవ్రమైన నొప్పి కూడా వస్తుంది. అలాంటి వారికి రోజ్ టీ వల్ల మేలు జరుగుతుంది. ఇదొక ఇంటి చిట్కా అనుకోవాలి. గులాబీ రేకులతో చేసే ఈ రోజ్ టీ తాగడం వల్ల పీరియడ్స్ నొప్పుల నుంచి బయట పడవచ్చని చెబుతున్నారు పోషకాహార నిపుణులు.


**పీరియడ్స్ నొప్పులు ఎందుకు వస్తాయి?**

పీరియడ్స్ సమయంలో వచ్చే పొట్టనొప్పిని డిస్మెనోరియా అని పిలుస్తారు. ఈ నొప్పులు పొత్తికడుపు భాగంలో, తొడల దిగువ భాగంలో, వీపు వెనుక భాగంలో వస్తాయి. ఋతుస్రావం అవుతున్నంతకాలం ఈ నొప్పులు వచ్చే అవకాశం ఉంది. ముఖ్యంగా మొదటి రెండు రోజుల్లో ఈ నొప్పులు తీవ్రంగా ఉంటాయి. గర్భాశయం నెలసరి సమయంలో సంకోచిస్తుంది. దానివల్లే ఈ నొప్పి వస్తుంది. అలాగే రుతుస్రావ సమయంలో గర్భాశయం తన లైనింగ్‌ను బయటికి పంపించేందుకు ప్రయత్నిస్తుంది. అందుకే నొప్పి తీవ్రంగా ఉంటుంది.

**రోజ్ టీతో ఆరోగ్యం**

పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పుల నుండి బయట పడేసే సమర్థత రోజ్ టీ కు ఉందని ఒక అధ్యయనం చెబుతోంది. 2005లో చేసిన ఒక అధ్యయనం ప్రకారం రోజ్ టీ ని ప్రతిరోజు తాగడం వల్ల పీరియడ్స్ సమయంలో వచ్చే నొప్పులను తగ్గించుకోవచ్చు. అంతేకాదు రోజ్ టీ తాగడం వల్ల మరెన్నో లాభాలు కూడా మహిళలకు కలుగుతాయి. రోజ్ టీలో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు అధికంగా ఉంటాయి. ఇవి గర్భాశయంతో సహా శరీరంలోని ఇన్ఫ్లమేషన్ ను తగ్గించడానికి సహాయపడతాయి. అలాగే పీరియడ్స్ క్రాంప్స్ కూడా తగ్గుతాయి.

గులాబీ రేకులతో తయారు చేసే రోజ్ టీలో సహజ సమ్మేళనాలు ఉంటాయి. ఇవి గర్భాశయ కండరాలను విశ్రాంతి పరుస్తాయి. దీనివల్ల పీరియడ్ నొప్పులు రాకుండా తగ్గుతాయి. జర్నల్ ఆఫ్ ఫుడ్ సైన్స్ లో ప్రచురించిన అధ్యయనం ప్రకారం రోజ్ టీలో గాలిక్ యాసిడ్ అధికంగా ఉంటుంది. ఇది యాంటీ మైక్రోబయల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలను కలిగి ఉంటుంది. అలాగే యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు కూడా ఎక్కువే. ఇది ఆక్సీకరణ ఒత్తిడిని తట్టుకునే శక్తిని శరీరానికి ఇస్తుంది. కాబట్టి శరీరం నెలసరి నొప్పిని తట్టుకునే శక్తిని పొందుతుంది. రోజ్ టీ తాగడం వల్ల శరీరం తేమవంతంగా ఉంటుంది. శరీరం హైడ్రేటెడ్ గా ఉంటే నెలసరి నొప్పులు తక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది. అలాగే కడుపు ఉబ్బరం వంటివి రాకుండా ఉంటాయి. గులాబీ టీలోని సువాసన, సహజ సమ్మేళనాలు మానసికంగా ప్రశాంతతను అందిస్తాయి. ఒత్తిడిని తగ్గించి మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. ఒత్తిడి అధికంగా ఉన్నా పీరియడ్స్ సమయంలో పొట్టనొప్పి అధికంగా వచ్చే అవకాశం ఉంది. కాబట్టి రోజ్ టీను ప్రతి రోజూ తాగితే నెలసరి సమయంలో వచ్చే నొప్పులను తగ్గించుకోవచ్చు. గర్భంతో ఉన్న మహిళలు, పిల్లలకు పాలు పెడుతున్న తల్లులు మాత్రం రోజ్ టీని వైద్యుల సలహాతోనే తాగడం మంచిది. దీన్ని తయారు చేయడం చాలా సులువు. తాజా గులాబీ పువ్వు రేకులను సేకరించి వాటిని శుభ్రంగా కడగాలి. గ్లాసు నీటిలో ఆ గులాబీ పూల రేకలను వేసి స్టవ్ మీద పెట్టి చిన్న మంట మీద మరిగించాలి. ఆ నీటిని వడకట్టి తాగాలి.




# రోగనిరోధక శక్తి పెంచే మార్గాలు

రోగ నిరోధక శక్తి పెంచుకోడానికి పెద్ద పెద్ద మందులు వాడక్కర్లేదు. ఈ సహజ మార్గాలు సరిగ్గా పాటిస్తే రోగనిరోధక శక్తి మీ సొంతమవుతుంది.

రోగనిరోధక శక్తి పెరగాలంటే మందులు వాడాల్సిన అవసరం లేదు. మన రోజూ వారీ జీవితంలో కొన్ని మార్పుల వల్ల సహజంగానే రోగ నిరోధక శక్తి క్రమంగా మెరుగుపడుతుంది. తరచూ జలబు, జ్వరాలు రావడం, నీరసంగా ఉండటం.. లాంటి సమస్యలకు రోగ నిరోధక శక్తి తక్కువుండటం కారణం. వర్షాకాలంలో ఈ సమస్యల నుంచి బయటపడాలింటే రోగనిరోధక శక్తి అవసరం. దాన్ని సహజంగా పెంచుకునే మార్గాలేంటో చూసేయండి.

1. **రెయిన్ బో డైట్:** అంటే మనం తినే ఆహారంలో అన్ని రకాల కూరగాయలు, పండ్లు ఉండాలి. పాలకూర పప్పు భోజనంలో తింటే సాయంత్రం పూట నారింజ పండు లేదా క్యారట్ తినడం.. క్యాప్సికం కర్రీ తింటే బెర్రీలు తినడం.. ఇలా రోజులో రకరకాల రంగులున్న పండ్లు కూరగాయలు తినాలి. ఆకుకూరలు, కాయగూరలు, పండ్లు ఏవైనా అంతే. ఎక్కువగా సి విటమిన్ ఉండే నిమ్మజాతి పండ్లు తీసుకోవచ్చు. వీటివల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. బెర్రీలు, ఆరెంజ్, నిమ్మకాయలు, క్యాప్సికం..లాంటివి ఎక్కువ తినాలి. అలా తినలేకపోతే ఒకేసారి స్మూతీలా చేసుకోవచ్చు. బెర్రీలు, బనానా, గుప్పెడు పాలకూర, చియా గింజలు కలిపి పాలు లేదా నీళ్లతో మిక్సీ పట్టి స్మూతీ తాగేయొచ్చు. ఇలా రకరకాలుగా ప్రయత్నించొచ్చు.
2. **ఆల్కహాల్:** ఆల్కహాల్ తాగడం వల్ల చాలా రకాల వ్యాధులొస్తాయి. దీర్ఘకాలిక వ్యాధులు రావడానికి కూడా ఇది కారణం. ఎక్కువగా వైరల్ ఇన్ఫెక్షన్లు సోకుతాయి. ఆల్కహాల్ తాగడం వల్ల రోగ నిరోధక శక్తి క్రమంగా తగ్గిపోతుంది. మనిషి బలహీనంగా మారిపోతారు. కాబట్టి దీనికి దూరంగా ఉంటే ఆరోగ్యం తెచ్చుకున్నట్లే.
3. **ప్రొటీన్:** శరీరం ఎదుగుదలకు, శక్తికి ప్రొటీన్ అవసరం. కాబట్టి హెల్తీ ప్రొటీన్ ఎంచుకోవాలి. గుడ్లు, శనగలు, పెసర్లు, మీల్ మేకర్, చికెన్, పప్పులు, బీన్స్ లాంటివి మంచి ఎంపిక. వాటిని ఆహారంలో చేర్చుకోవాలి. పన్నీర్, టోఫు, చీజ్, పాల ఉత్పత్తుల్ని కూడా చేర్చుకోవాలి.
4. **నీళ్లు:** మన శరీరంలో ఎక్కువ శాతం ఉండేది నీరు. ఎప్పటికప్పుడు శరీరాన్ని హైడ్రేట్ చేసుకోవాలి. హెర్బల్ టీలు, కూరగాయలు జ్యూసులు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు తాగుతుండాలి. తప్పకుండా రోజుకు ఎనిమిది గ్లాసుల నీళ్లు తాగాలి. ఇది శరీరం ఆరోగ్యంగా ఉండేలా సాయపడుతుంది. కిడ్నీ సంబంధిత వ్యాధుల్తో పాటూ చాలా రకాల రోగాల్ని మనకు రాకుండా కాపాడుకోవచ్చు.
5. **వ్యాయామం:** మెట్లు ఎక్కడం, నడవటం లాంటివి మానేయకండి. రోజులో కొన్ని పనులకు నడిచే వెళ్లాలని నియమం పెట్టుకోండి. రోజులో కనీసం అయిదు రోజులైనా అరగంట పాటూ వ్యాయామం చేయండి. యోగాసనాలు చేయొచ్చు. డ్యాన్స్ చేయొచ్చు. జాగింగ్ చేయొచ్చు. ఏదో ఒక రకంగా శరీరం కదిలేలా చూసుకోండి.
6. **శ్వాస వ్యాయామాలు:** శ్వాస మీద ధ్యాస పెట్టి ద్యానం చేయడం వల్ల ఒత్తిడి తగ్గుతుంది. ఒత్తిడి అనేక రోగాలకు కారణం. కాబట్టి రోజుకు కనీసం అయిదు నిమిషాలన్నా శ్వాస వ్యాయామాలు చేయడం వల్ల ఆరోగ్యంగా, ప్రశాంతంగా ఉంటాం. దీని ప్రభావం మన రోగనిరోధక శక్తిమీద తప్పకుండా ఉంటుంది.
7. **నిద్ర:** రోజంతా ఎంత కష్టపడ్డా మన శరీరం మరమ్మతు చేసుకునేది మనం పడుకున్నప్పుడు. సరైన నిద్రలేకపోతే ఊరికే నీరసంగా అనిపిస్తుంది. నిద్ర పట్టకపోతే మంచి బాతింగ్ సాల్ట్ తో స్నానం చేయడం, ఎలక్ట్రానిక్ డివైస్ వాడకుండా ఉండటం, నిద్రపోయే సమయం కన్నా కనీసం రెండు గంటల ముందే తినడం లాంటి నియమాలు పాటించాలి. దాని ద్వారా తొందరగా నిద్ర పడుతుంది. కొత్త ఉత్సాహంతో మరో రోజు మొదలుపెడతారు.

ఇవన్నీ పాటించడం ద్వారా మన రోగనిరోధక శక్తి క్రమంగా మెరుగుపడుతుంది. ఎలాంటి మందులు అవసరం లేకుండా ముందు ఇవి ప్రయత్నించి చూడండి.






# మిస్టర్ బచ్చన్ నుంచి ఫస్ట్ సింగిల్ రిలీజ్

రవితేజ కథానాయకుడిగా హరీష్‌శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వ ప్రసాద్ నిర్మిస్తున్నారు. భాగ్యశ్రీ బోర్సే కథానాయిక. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. బుధవారం ఈ సినిమాలోని తొలి గీతాన్ని విడుదల చేశారు. మిక్కీ జే మేయర్ స్వరపరచిన ఈ పాటను సాహితీ రచించారు. 'చిట్టిగువ్వ పిట్టలాంటి చక్కనమ్మా..బొట్టు పెట్టి పట్టుచీర కట్టుకోమ్మ జట్టుకట్టి చుట్టమల్లె చుట్టుకోమ్మా..' అంటూ చక్కటి భావాలతో ఈ పాట సాగింది. కశ్మీర్ నేపథ్యంలో చిత్రీకరించిన విజువల్స్ ఆకట్టుకున్నాయి. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తనదైన శైలి వినోదంతో దర్శకుడు హరీష్‌శంకర్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని మేకర్స్ తెలిపారు. జగపతిబాబు, సచిన్ ఖేడేకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: ఆయనంక బోస్, రచనదర్శకత్వం: హరీష్ శంకర్.



# శభాష్ నభా నటేష్..!

అనుకున్నది సాధించాలనే సంకల్పం వుంటే.. ఎంతటి కష్టాలు ఎదురైనా తమ లక్ష్యాన్ని చేరుకోవచ్చు అని నిరూపించారు తెలుగు కథానాయిక నభా నటేష్. టాలీవుడ్ యంగ్ హీరోయిన్ నభా నటేష్ దర్శకుడు పూరీ జగన్నాథ్ తెరకెక్కించిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయింది. ఈ సినిమా ఘన విజయంతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. దీంతో ఈ భామకు చాలా ఆఫర్లు వెల్లువెత్తాయి. అయితే ఉన్నట్లుండి ఈ ముద్దుగుమ్మ గత ఏడాది నుండి కనపడకుండాపోయింది. ఏ సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా లేదు. దీంతో నభాకు ఏమైందని నెట్టింట చర్చలు జరిగాయి. తాజాగా ఈ విషయంపై నటి నభా స్పందించింది. తాను సినిమాలకు దూరంగా ఉండటానికి కారణం, తనకు ఓ పెద్ద యాక్సిడెంట్ జరిగిందని తెలిపింది. ఆ ప్రమాదం కారణంగా గత ఏడాది తనకు చాలా కఠినంగా సాగిందని.. తన ఎడమ భుజానికి తీవ్రంగా గాయమైందని పేర్కొంది. మల్టీపుల్ బోన్ ఫ్రాక్చర్ జరిగాయి.అంతే కాకుండా కొన్ని కంప్లికేటెడ్ సర్జరీలు జరిగాయి అని నభా నటేష్ తెలిపారు. యాక్సిడెంట్ జరిగినప్పుడు తన మానసికి పరిస్థితి ఎలా ఉందో వివరించింది. చాలా సర్జరీలు జరిగాయని, ఊహించని శారీరక మానసిక బాధను అనుభవించిందని తెలిపింది. కెరీర్ చాలా పీక్స్‌లో ఉన్నప్పుడే ప్రమాదానికి గురవ్వడం జరిగింది. ఓ రకమైన మైండ్ సెట్ లోకి వెళ్ళిపోయానని తను పేర్కొంది. గాయం నుంచి కోలుకోని మళ్లీ సినిమాలు చేయడం అంత సులువైన విషయం కాదని నభా నటేష్ పేర్కొన్నారు. అయితే తను ప్రమాదం నుంచి తేరుకొని మళ్ళీ తెరపైన అంతే ఎనర్జిటిక్‌గా కనిపించడం చాలా గొప్ప విషయంగా చెప్పుకోవచ్చు. నభా నటేష్ ఫిట్‌నెస్ సాధించి `డార్లింగ్` అనే చిత్రంతో రీ ఎంట్రీ ఇవ్వనుంది. ఈ నెల 19 న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇది తనకు సెకండ్ ఇన్నింగ్స్ లాంటిది. ఏదైన ప్రమాదం జరిగినప్పుడు కుంగి పోకుండా నభా నటేష్ తేరుకున్నతీరు చాలా మందికి స్ఫూర్తినిస్తుంది. `శభాష్ నభా నటేష్ తన పట్టుదల, అంకిత భావంతో ఆమె అనుకున్నది సాధించింది.



# అస్తిత్వ పోరులో 'తంగలాన్'..

## ఆసక్తికరంగా ట్రైలర్

తమిళ అగ్ర హీరో విక్రమ్ నటిస్తున్న మరో ప్రయోగాత్మక చిత్రం 'తంగలాన్'. పా.రంజిత్ దర్శకుడు. స్టూడియో గ్రీన్ పతాకంపై కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. పార్వతీ తిరువోతు, మాళవిక మోహనన్ కథానాయికలు. కోలార్ బంగారు గనుల నేపథ్యంలో యథార్థ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. త్వరలో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. బుధవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. బంగారం వేటలో రెండు తెగల మధ్య పోరుతో ఆరంభమైన ట్రైలర్ ఆద్యంతం భావోద్వేగభరితంగా సాగింది. బ్రిటీష్ అధికారులు బంగారం వెలికితీత కోసం స్థానిక తెగల వారిని పనిలో పెట్టుకుంటారు. అందులో ఓ తెగ నాయకుడిగా విక్రమ్ కనిపించారు. తన వారి అస్తిత్వం కోసం ఎంతటి సాహసానికైనా సిద్ధపడే నాయకుడిగా విక్రమ్ పాత్ర శక్తివంతంగా సాగింది. విల్లు, బరిసెలు, ఈటెలతో చేసిన యాక్షన్ సీక్వెన్స్ హైలైట్‌గా నిలిచాయి. ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతాన్నందిస్తున్నాడు.





# 'భారతీయుడు 2' టికెట్ ధరల పెంపు..

మరో 2 రోజుల్లో కమల్‌హాసన్ 'భారతీయుడు 2' సందడి మొదలు కానున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన టీజర్‌తో పాటు ట్రైలర్‌లు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలోనే ఈ సినిమాకు సంబంధించి స్పెషల్ షోలు వేసుకునేందుకు తెలంగాణ రాష్ట్ర హోంశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ జితేందర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలో ఈ సినిమాను సురేష్ ప్రొడక్షన్స్ సంస్థ రిలీజ్ చేస్తున్న విషయం తెలిసిందే.. అయితే ఈ సినిమాకు టికెట్ రేట్లు పెంచుకునే అవకాశం ఇవ్వాలని చిత్ర నిర్మాణ సంస్థ ప్రభుత్వాన్ని కోరింది. ఇక ఈ అభ్యర్థనకు తెలంగాణ రాష్ట్ర హోంశాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మల్టీప్లెక్స్ లో 75 రూపాయలతో పాటు సింగిల్ స్క్రీన్స్ లో 50 రూపాయలు పెంచుకునేందుకూ అనుమతులు ఇచ్చింది. అలాగే ఉదయాన్నే మరో షో వేసుకునేందుకు కూడా అవకాశం కల్పించింది. కమల్ శంకర్ కాంబినేషన్‌లో 1996లో రిలీజైన భారతీయుడు చిత్రం ఎంత పెద్ద సక్సెస్ అయ్యిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక ఈ సినిమా విడుదలైన 28 ఏండ్ల తర్వాత దీనికి సీక్వెల్ రాబోతుండడంతో మూవీపై భారీ అంచనాలు ఉన్నాయి. రకుల్ ప్రీత్ సింగ్, ప్రియా భవానీ శంకర్, ఎస్జే సూర్య, సిద్దార్థ్, గుల్షన్ గ్రోవర్‌లు కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని లైకా ప్రొడక్షన్స్ రెడ్ జియాంట్ మూవీస్ పై ఉదయనిధి స్టాలిన్‌సుభాస్కరన్ నిర్మిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com